

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 27-12-2025 | సంపుటి - 26 | సంచిక -219 | రూ : 4 | పేజీలు: 8


### అగరుబత్తీలపై కేంద్రం కొత్త ప్రమాణాలు..

## వినియోగదారుల భద్రతే లక్ష్యం

- అగరుబత్తీల తయారీలో కీలక మార్పులు
- బీఐఎస్ కొత్త ప్రమాణాలు విడుదల
- హానికర రసాయనాలు, సువాసనల వాడకంపై నిషేధం
- నాణ్యమైన ఉత్పత్తులకు బీఐఎస్ స్టాండర్డ్ మార్క్
- భారత ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్‌లో పెరగనున్న ఆదరణ

2లో







2లో

## రైతు భరోసాకు కొత్త రూల్స్..

### ఇకపై సాగు చేసేవారికే పెట్టుబడి సాయం

- సంక్రాంతి కానుకగా యాసంగి రైతు భరోసా నిధులు
- ఈసారి కొత్త నిబంధనలు.. శాటిలైట్‌తో భూముల పరిశీలన
- పంట సాగు చేసే నిజమైన రైతులకే పెట్టుబడి సాయం
- సాగులో లేని భూములు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు కోత
- అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై అధికారిక ప్రకటనకు అవకాశం



2లో

### బాల పురస్కారం అందుకున్న

## క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ

- 14 ఏళ్ల క్రికెటర్ వైభవ్ సూర్యవంశీకి ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్
- ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు ప్రధానం
- పురస్కార కార్యక్రమం కారణంగా విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌కు దూరం
- అండర్-19 ప్రపంచకప్ కోసం భారత జట్టుతో చేరనున్న వైభవ్

### కీలక నేతలతో

## కేసీఆర్ భేటీ..

### గరంగరంగా తెలంగాణ రాజకీయం

- ఫామ్ హౌస్ లో కేటీఆర్, హరీశ్ తదితరులతో కేసీఆర్ భేటీ
- అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ
- ఫోన్ ట్యాంపింగ్ అంశంపై కూడా చర్చ జరిగినట్టు సమాచారం



2లో




2లో

### హెచ్1బీ వీసా అంశంపై

## స్పందించిన భారత్

- వీసా అపాయింట్‌మెంట్‌ల షెడ్యూలింగ్ లేదా రీషెడ్యూలింగ్‌లో ఇబ్బందులు
- ఫిర్యాదులు అందినట్లు తెలిపిన రణధీర్ జైశ్వాల్
- భారత సంతతి వ్యక్తి మృతిపై కెనడా ప్రభుత్వానిదే బాధ్యత అన్న భారత్



2లో

## నేటి నుంచి పెరిగిన రైలు ఛార్జీలు

- సబర్బన్, సీజన్ టికెట్లకు మినహాయింపు
- కిలోమీటర్‌కు 1 నుంచి 2 పైసల వరకు పెంపు
- నిర్వహణ ఖర్చుల వల్లే పెంచవలసి వచ్చిందంటున్న ప్రభుత్వం
- ప్రభుత్వ నిర్ణయంపై విపక్షాల తీవ్ర విమర్శలు

### ప్రాచీన విజ్ఞానానికి

## భారత్ పుట్టినిల్లు: సీఎం చంద్రబాబు

- భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్‌లో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌పై ప్రశంసల వర్షం
- ప్రాచీన కాలంలోనే విజ్ఞానంలో భారత్ అగ్రగామి : సీఎం
- యోగా, ఆయుర్వేదం, సున్నాను ప్రపంచానికి అందించింది మనమేనని వెల్లడి
- ఆర్యభట్ట, కౌటిల్యుడు వంటి మహానుభావులు మనకు స్ఫూర్తిదాయకమన్న సీఎం



2లో

# అగరుబత్తీలపై కేంద్రం కొత్త ప్రమాణాలు... వినియోగదారుల భద్రతే లక్ష్యం

ఢిల్లీ: దేశంలో అగరుబత్తీల (ధూప్ స్టిక్స్) నాణ్యత, భద్రతను పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వినియోగదారుల ఆరోగ్యం, పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) కొత్త ప్రమాణాలను విడుదల చేసింది. 'జాతీయ వినియోగదారుల దినోత్సవం 2025' సందర్భంగా శుక్రవారం కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి "ఐఎస్ 19412:2025 - అగరుబత్తీల స్పెసిఫికేషన్" పేరుతో ఈ నూతన ప్రమాణాలను ఆవిష్కరించారు. ఈ కొత్త నిబంధనల ప్రకారం, అగరుబత్తీల తయారీలో పలు హానికరమైన పురుగుమందులు, సింథటిక్ సువాసనల వాడకాన్ని పూర్తిగా నిషేధించారు. అలత్రిన్, పెర్మెత్రిన్, సైపర్‌మెత్రిన్, డెల్టామెత్రిన్, ఫిప్రోనిల్ వంటి పురుగుమందులతో పాటు బెంజైల్ సైనైడ్, ఇథైల్ అక్రిలేట్ వంటి రసాయనాల వాడకంపై ఆంక్షలు విధించారు. వీటిలో చాలా రసాయనాలు మానవ ఆరోగ్యం, గాలి నాణ్యతపై తీవ్ర ప్రభావం చూపుతాయని అంతర్జాతీయంగా నిషేధంలో ఉన్నాయి. ప్రపంచంలోనే అగరుబత్తీల ఉత్పత్తి, ఎగుమతుల్లో భారత్ అగ్రస్థానంలో ఉంది. దేశంలో ఏటా రూ. 8,000 కోట్ల పరిశ్రమ ఉండగా, సుమారు 150 దేశాలకు రూ. 1,200 కోట్ల విలువైన ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. ఈ రంగం గ్రామీణ ప్రాంతాల్లోని ఎందరో చేతివృత్తుల వారికి, మహిళలకు ఉపాధి కల్పిస్తోంది. కొత్త ప్రమాణాల ప్రకారం అగరుబత్తీలను యంత్ర నిర్మిత, చేతితో తయారు చేసినవి, సాంప్రదాయ మసాలా రకాలుగా వర్గీకరించారు. ముడిసరుకులు, మండే విధానం, సువాసన వంటి అంశాల్లో నాణ్యతను నిర్దేశించారు. ఈ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ఉత్పత్తులకు 'బీఐఎస్ స్టాండర్డ్ మార్క్' లభిస్తుంది. దీనివల్ల వినియోగదారులు నాణ్యమైన, సురక్షితమైన ఉత్పత్తులను సులభంగా గుర్తించవచ్చని ప్రభుత్వం తెలిపింది. ఈ నిర్ణయం వినియోగదారుల నమ్మకాన్ని పెంచడంతో పాటు, భారత అగరుబత్తీలకు అంతర్జాతీయ మార్కెట్‌లో మరింత ఆదరణ లభిస్తుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

## కీలక నేతలతో కేసీఆర్ భేటీ.. గరంగరంగా తెలంగాణ రాజకీయం

హైదరాబాద్: తెలంగాణలో రాజకీయాలు మళ్లీ వేడెక్కాయి. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మళ్లీ యాక్టివ్ మోడ్‌లోకి వెళ్లారు. వరుస సమావేశాలు, నేతలతో మంతనాలు, వ్యూహాత్మక నిర్ణయాలతో ఆయన రాజకీయాల్లో దూకుడు పెంచుతున్నారు. ముఖ్యంగా శాసనసభ సమావేశాలు సమీపిస్తున్న వేళ, పార్టీని మళ్లీ పోరాటానికి సిద్ధం చేసే దిశగా కేసీఆర్ అడుగులు వేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ ఈరోజు కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాలకు చెందిన ముఖ్య నేతలు పాల్గొన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో పార్టీ తరపున అనుసరించాల్సిన వ్యూహం, ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై ఎలా ఎదురుదాడి చేయాలన్న అంశాలపై కేసీఆర్ స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. అలాగే రానున్న రోజుల్లో నిర్వహించాల్సిన బహిరంగ సభలు, నియోజకవర్గ స్థాయి కార్యక్రమాల తేదీలపై కూడా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. పార్టీ శ్రేణులు ప్రజల్లోకి మరింత బలంగా వెళ్లాలని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కేసీఆర్ నేతలకు సూచించినట్లు సమాచారం.

ఇదిలా ఉండగా, ఇదే సమయంలో మరో కీలక పరిణామం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయాలన్న దిశగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసును తుది దశకు తీసుకెళ్లాలంటే కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రి హరీశ్ రావును కూడా విచారించాల్సిన అవసరం ఉందని సిట్ భావిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే కేసీఆర్, హరీశ్ రావులకు త్వరలో సమన్లు జారీ చేసి విచారణ చేపట్టాలని సిట్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే శాసనసభ సమావేశాల సమయంలో రాజకీయ ఉద్రిక్తతలు పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో, సమావేశాలు ముగిసిన తర్వాత నోటీసులు ఇవ్వాలని నిర్ణయించినట్లు టాక్ నడుస్తోంది. ఈ మొత్తం పరిణామాల మధ్య కేసీఆర్ రాజకీయంగా వేగం పెంచడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఒకవైపు ప్రభుత్వంపై దాడికి సిద్ధమవుతూ, మరోవైపు న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొనే వ్యూహంతో ఆయన ముందుకు సాగుతున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారనున్నాయన్న సంకేతాలు ఇప్పటికే కనిపిస్తున్నాయి.

## రైతు భరోసాకు కొత్త రూల్స్.. ఇకపై సాగు చేసేవారికే పెట్టుబడి సాయం

హైదరాబాద్: తెలంగాణ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించేందుకు సిద్ధమవుతోంది. యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని సంక్రాంతి పండుగ కానుకగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. అయితే, ఈసారి పథకం అమలులో ప్రభుత్వం కీలక మార్పులు చేపట్టింది. కేవలం పంటలు సాగు చేసే నిజమైన రైతులకే ప్రయోజనం చేకూరేలా పక్కా ప్రణాళికతో ముందుకెళుతోంది. గతంలో సాగు చేయని భూములకు కూడా నిధులు అందుతున్నాయన్న విమర్శల నేపథ్యంలో, ఈసారి ప్రభుత్వం టెక్నాలజీ సాయం తీసుకుంటోంది. ఉపగ్రహ చిత్రాల ద్వారా వ్యవసాయ భూములను క్షుణ్ణంగా పరిశీలించి, డిజిటల్ మ్యాపింగ్ ద్వారా ఏ పొలంలో పంట ఉందో, ఏది ఖాళీగా ఉందో గుర్తిస్తున్నారు. దీనివల్ల సాగులో లేని బంజరు భూములు, గుట్టలు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు రైతు భరోసా నిలిచిపోనుంది. ఈ చర్యతో ప్రభుత్వ ఖజానాపై భారం తగ్గడమే కాకుండా, అర్హులైన రైతులకే లబ్ధి చేకూరుతుంది. ప్రస్తుత బడ్జెట్‌లో ప్రభుత్వం ఈ పథకానికి రూ. 18,000 కోట్లు కేటాయించింది. గత వానాకాలం సీజన్‌లో సుమారు 69 లక్షల మంది రైతులకు రూ. 9,000 కోట్లను కేవలం 9 రోజుల్లోనే జమ చేసింది. ఇప్పుడు యాసంగికి కూడా జనవరి రెండో వారం నాటికి లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసి, పండుగలోపు నిధులు పంపిణీ చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

## ప్రాచీన విజ్ఞానానికి భారత్ పుట్టినిల్లు: సీఎం

తిరుమల: భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు, దేశ ప్రాచీన వైభవాన్ని, విజ్ఞాన ఘనతను కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేస్తున్న కృషిని ప్రత్యేకంగా అభినందించారు. దేశం, భారతీయత గురించి చర్చించుకోవడానికి ఇది సరైన వేదిక అని ఆయన అన్నారు. ప్రాచీన కాలంలోనే భారతదేశం విజ్ఞానాన్ని సముపార్జించిన దేశంగా నిలిచిందని చంద్రబాబు గుర్తుచేశారు. "వేల ఏళ్ల క్రితమే హరప్పా నాగరికత ద్వారా అర్బన్ ప్లానింగ్ అంటే ఏమిటో ప్రపంచానికి చాటిచెప్పిన ఘనత మనది. 2900 ఏళ్ల క్రితమే యోగాను అభ్యసించాం. నేడు ప్రధాని మోదీ కృషితో 150 దేశాలు యోగాను పాటిస్తున్నాయి. 2600 ఏళ్ల క్రితమే ఆయుర్వేదం ద్వారా వైద్య సేవలు అందించిన చరిత్ర మనకుంది" అని ఆయన వివరించారు. పూర్వ కాలంలోనే తక్షశిల, నలంద వంటి విశ్వవిద్యాలయాల ద్వారా ఆధునిక విద్యను అందించిన ఘనత భారతదేశానిదని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రపంచానికి సున్నాను పరిచయం చేసింది, మెదడుకు పదును పెట్టే చదరంగాన్ని కనిపెట్టింది కూడా భారతీయులేనని ఆయన అన్నారు. ఖగోళశాస్త్రంలో ఆర్యభట్ట, గణితంలో భాస్కరాచార్య, వైద్యంలో చరక, ధన్వంతరి, అర్థశాస్త్రంలో కౌటిల్యుడు వంటి మహానుభావులు మనందరికీ స్ఫూర్తి అని చంద్రబాబు పేర్కొన్నారు. వివిధ కీలక రంగాల్లో నైపుణ్యం సాధించిన ఎందరో నిపుణులు మన దేశం సొంతమని ఆయన అన్నారు.

## నేటి నుంచి పెరిగిన రైలు ఛార్జీలు

ఢిల్లీ: దేశవ్యాప్తంగా రైలు ప్రయాణికులపై కేంద్ర ప్రభుత్వం మరోసారి భారం మోపింది. పెంచిన రైలు ఛార్జీలు నేటి నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ ఏడాది జులైలో ఒకసారి ఛార్జీలు పెంచిన రైల్వే శాఖ, కేవలం ఐదు నెలల వ్యవధిలోనే రెండోసారి ధరలను పెంచడం గమనార్హం. మెయిల్/ఎక్స్‌ప్రెస్, ఏసీ క్లాసులతో పాటు, 215 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ప్రయాణించే ఆర్డినరీ నాన్‌ఏసీ క్లాసులపై కూడా ఈ పెంపు ప్రభావం చూపనుంది. అయితే, సబర్బన్ (లోకల్) రైళ్లు, సీజన్ టికెట్లకు ఈ పెంపు నుంచి పూర్తిగా మినహాయింపు ఇవ్వడం సామాన్య ప్రయాణికులకు కొంత ఊరటనిచ్చే అంశం.

**పెంపు వెనుక కారణాలివే..**

భారీగా పెరిగిన నిర్వహణ ఖర్చులు, ముఖ్యంగా సిబ్బంది జీతభత్యాలు (రూ.1,15,000 కోట్లు), పెన్షన్ల బిల్లు (రూ.60,000 కోట్లు) భారాన్ని తగ్గించుకునేందుకే ఈ "ఛార్జీల హేతుబద్ధీకరణ" చేపట్టినట్లు రైల్వే మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పెంపు ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా సుమారు రూ.600 కోట్ల అదనపు ఆదాయం సమకూరుతుందని అంచనా వేస్తున్నారు. ప్రయాణికులపై ఎక్కువ భారం పడకుండా, రైల్వేల ఆర్థిక సుస్థిరతను కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఛార్జీలు పెంచినప్పటికీ, ఇప్పటికీ ప్రయాణికుల టికెట్ ధరలో దాదాపు 50 శాతం సబ్సిడీ రూపంలో తామే భరిస్తున్నామని రైల్వే శాఖ పేర్కొంది.

**ఎవరిపై ఎంత భారం?**

రైల్వే బోర్డు జారీ చేసిన కమర్షియల్ సర్క్యులర్ నం. 24 ప్రకారం, ఛార్జీల పెంపు ఇలా ఉంది:

సబర్బన్, సీజన్ టికెట్లు: ఎలాంటి మార్పు లేదు.

ఆర్డినరీ నాన్‌ఏసీ: 215 కిలోమీటర్ల వరకు ప్రయాణించే వారికి పాత ఛార్జీలే వర్తిస్తాయి. ఆ తర్వాత దూర ప్రయాణాలపై శ్లాబుల వారీగా రూ.5 నుంచి రూ.20 వరకు పెంచారు.

స్లీపర్ క్లాస్ (ఆర్డినరీ): కిలోమీటర్‌కు 1 పైసా పెరిగింది.

మెయిల్/ఎక్స్‌ప్రెస్ (నాన్‌ఏసీ, ఏసీ క్లాసులు): స్లీపర్, ఏసీ చైర్ కార్, ఏసీ 3టైర్, 2టైర్, ఫస్ట్ క్లాస్‌తో పాటు రాజధాని, శతాబ్ది, వందే భారత్ వంటి అన్ని ప్రీమియం రైళ్లలో కిలోమీటర్‌కు 2 పైసల చొప్పున ఛార్జీలు పెరిగాయి.

డిసెంబర్ 26కు ముందే టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులు అదనపు ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని రైల్వే శాఖ స్పష్టం చేసింది. రిజర్వేషన్ ఫీజు, సూపర్‌ఫాస్ట్ సర్‌ఛార్జ్‌లలో ఎలాంటి మార్పులు చేయలేదు.

**ప్రభుత్వంపై విపక్షాల తీవ్ర విమర్శలు**

రైలు ఛార్జీల పెంపుపై విపక్షాలు తీవ్రంగా మండిపడ్డాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందిస్తూ, "మోదీ ప్రభుత్వం సామాన్య ప్రజలను దోచుకోవడానికి ఏ అవకాశాన్నీ వదలడం లేదు. బడ్జెట్‌కు కొన్ని రోజుల ముందు, పార్లమెంటులో చర్చ లేకుండా ఛార్జీలు పెంచారు. ప్రత్యేక రైల్వే బడ్జెట్ లేకపోవడంతో జవాబుదారీతనం కనుమరుగైంది" అని విమర్శించారు. రైల్వే భద్రతా వ్యవస్థ 'కవచ్' కేవలం 3% మార్గాలకే పరిమితమైందని, ఇది కేవలం ప్రచారానికే తప్ప ఆచరణలో విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సాధారణ ప్రయాణికుల ప్రయాణం "నరకప్రాయంగా" మారిందని పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ విమర్శించారు.

## హెచ్1బీ వీసా అంశంపై స్పందించిన భారత్

ఢిల్లీ: అమెరికా హెచ్ 1బీ వీసా అపాయింట్‌మెంట్‌ల షెడ్యూలింగ్ లేదా రీషెడ్యూలింగ్‌లో సమస్యలు ఎదురవుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని భారత విదేశాంగ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు. ఈ విషయాన్ని తాము అమెరికా అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినట్లు ఆయన వెల్లడించారు. ఇది అమెరికా సార్వభౌమాధికార పరిధిలోని అంశమే అయినప్పటికీ, తమ ఆందోళనలను అమెరికాకు తెలియజేశామని ఆయన పేర్కొన్నారు. కెనడాలో గుండెపోటు కారణంగా భారత సంతతికి చెందిన వ్యక్తి ఇటీవల మరణించిన ఘటనపై కూడా భారత్ స్పందించింది. మృతుడు భారత సంతతికి చెందిన వ్యక్తి అయినప్పటికీ, అతనికి కెనడా పౌరసత్వం ఉందని స్పష్టం చేసింది. ఈ విషయంలో కెనడా ప్రభుత్వానిదే బాధ్యత అని పేర్కొంది. తీవ్ర ఛాతి నొప్పితో తన భర్తను ఆసుపత్రిలో చేర్పించినప్పటికీ, చికిత్స కోసం దాదాపు ఎనిమిది గంటలు వేచిచూడాల్సి వచ్చిందని, దీని కారణంగానే తన భర్త ప్రాణాలు కోల్పోయాడని మృతుడి భార్య ఆరోపించారు.

## తిరుపతిలో ఎన్టీఆర్ రాజు నివాసానికి వెళ్లిన సీఎం చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం తిరుపతిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇటీవల మరణించిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, ఎన్టీఆర్ వీరాభిమాని ఎన్టీఆర్ రాజు కుటుంబాన్ని పరామర్శించారు. ఎన్టీఆర్ రాజు కుమారుడు, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ నివాసానికి వెళ్లిన ముఖ్యమంత్రి, ఎన్టీఆర్ రాజు మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ రాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీధర్ వర్మ కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి ధైర్యం చెప్పారు. ముఖ్యమంత్రి వెంట మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు అమర్‌నాథ్, పులివర్తి నాని, స్థానిక నేతలు ఉన్నారు.



## బాల పురస్కారం అందుకున్న క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ

బీహార్: బీహార్‌కు చెందిన 14 ఏళ్ల యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ అరుదైన గౌరవాన్ని అందుకున్నాడు. క్రీడల విభాగంలో అతడు కనబరిచిన అసాధారణ ప్రతిభకు గుర్తింపుగా 'ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్' వరించింది. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా వైభవ్ ఈ పురస్కారాన్ని స్వీకరించాడు. ఈ పురస్కార ప్రదానోత్సవం కారణంగా, వైభవ్ ప్రస్తుతం జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో మణిపూర్‌తో జరిగిన మ్యాచ్‌కు దూరంగా ఉండాల్సి వచ్చింది. అంతకుముందు అరుణాచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ 190 పరుగులతో అద్భుత ప్రదర్శన చేసిన సంగతి తెలిసిందే. అవార్డుల కార్యక్రమంలో పాల్గొనేందుకు ఉదయం 7 గంటలకే రాష్ట్రపతి భవన్‌కు హాజరు కావడంతో అతను మ్యాచ్ ఆడలేకపోయాడు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ.. పురస్కారాలు అందుకున్న చిన్నారులను అభినందించారు. "మీ విజయాలు దేశం మొత్తానికి స్ఫూర్తినిస్తాయి. మీ లాంటి ప్రతిభావంతుల వల్లే భారతదేశం ప్రపంచ వేదికపై వెలుగొందుతోంది" అని ఆమె అన్నారు. వైభవ్‌తో పాటు వివిధ రంగాలకు చెందిన మరో 19 మంది చిన్నారులు కూడా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. కాగా, వైభవ్ ఈ సీజన్‌లో విజయ్ హజారే ట్రోఫీలో ఆడే అవకాశం లేదు. జనవరి 15 నుంచి ప్రారంభం కానున్న అండర్ 19 ప్రపంచకప్ కోసం సన్నద్ధమయ్యేందుకు అతడు త్వరలోనే భారత జట్టుతో చేరనున్నట్లు సమాచారం.

## రౌడీయిజం చేస్తే రాష్ట్ర బహిష్కరణే: సీఎం చంద్రబాబు స్ట్రిక్ట్ వార్నింగ్

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల పుణ్యక్షేత్రం పవిత్రతను కాపాడటం, దేశ విదేశాల నుంచి తరలివచ్చే కోట్లాది మంది భక్తులకు పూర్తిస్థాయి భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదని, రాజకీయ ముసుగులో రౌడీయిజం, అరాచకాలకు పాల్పడితే ఎంతటివారైనా సరే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే రాష్ట్రం నుంచి బహిష్కరిస్తామని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. శుక్రవారం తిరుపతిలో అత్యాధునిక వసతులతో నిర్మించిన నూతన జిల్లా పోలీసు కార్యాలయాన్ని (డీపీఓ) ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంమంత్రి వంగలపూడి అనితతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఆయన, నూతన కార్యాలయంలోని వసతులను పరిశీలించి, విజిటర్స్ పుస్తకంలో తన సందేశాన్ని రాశారు. కలియుగ వైకుంఠమైన తిరుమల క్షేత్రానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని, ఇక్కడికి వచ్చే భక్తులలో భద్రతా భావాన్ని కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని అన్నారు. ముఖ్యంగా వైకుంఠ ఏకాదశి వంటి పర్వదినాల సమయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. నేరాల నియంత్రణలో ఆధునిక టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా ఉంచి, కీలక ఆధారాలను సేకరించాలని, నేరస్తుల ఆలోచనల కన్నా ఓ అడుగు ముందుండాలని పిలుపునిచ్చారు. 'విజిబుల్ పోలీసింగ్, ఇన్విజిబుల్ పోలీస్' అనే విధానాన్ని అనుసరించి, ప్రజలకు భరోసా ఇస్తూనే నేరగాళ్ల కదలికలను పసిగట్టాలని స్పష్టం చేశారు.

# మత్స్యకారులకు 40 శాతం సబ్సిడీతో ఆటోలు ఇచ్చేందుకు చర్యలు: మంత్రి డీఎస్‌బీవీ స్వామి

టంగుటూరు: మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాష్ట్ర మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి అన్నారు. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో మత్స్యకారులకు సంప్రదాయ వలలను పంపిణీ చేశారు. ఒక్కో యూనిట్ కాస్ట్ ధర రూ.2,43,700 కాగా.. ఏడుగురు మత్స్యకారులకు వలలు అందించినట్లు తెలిపారు. త్వరలో మత్స్యకారులకు ఇంజిన్‌తో పాటు బోట్లను అందిస్తామని తెలిపారు. దీని ధర రూ.52 లక్షలు వరకు ఉంటుందని తెలిపారు. మత్స్యకారులకి ఏదైనా ఆర్థిక సాయం చేయాలంటే కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని చెప్పారు. గతంలో మత్స్యకారుల కుటుంబానికి రూ.4,500 ఇవ్వగా.. ప్రస్తుతం వేటకు వెళ్లే వారికి రూ.20 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. మత్స్యకారులకు



50 ఏళ్లకు పింఛను అందజేస్తామన్నారు. త్వరలో 40 శాతం సబ్సిడీతో వారికి ఆటోలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మత్స్య సంపద ప్రజల ఆరోగ్యానికి మంచి ఆహారమని, దీనిని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా మత్స్యశాఖ జేడీ శ్రీనివాసరావు, ఎఫ్‌డీవో రవికుమార్, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# సాఫ్ట్‌వేర్ ఉద్యోగం మానేసి..
## గంజాయి తరలిస్తూ పోలీసులకు చిక్కిన యువతి

నర్సీపట్నం అర్బన్: అనకాపల్లి జిల్లా నాతవరం పోలీసులు శుక్రవారం గంజాయి ముఠాని అరెస్టు చేశారు. కేసు వివరాలను నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు మీడియాకు వివరించారు. నిందితుల నుంచి 74 కిలోలు గంజాయి, కారు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ మొత్తం రూ.33 లక్షలు ఉంటుందని తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో బీటెక్ చదువుకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసి మానేసిన విజయనగరం జిల్లా సంతకవిటి మండలం మాడుగులపేట గ్రామానికి చెందిన గాది రేణుకగా పోలీసులు గుర్తించారు. ఆమెతో పాటు తమిళనాడుకు చెందిన సూర్య కాళిదాసు మదన్ కుమార్, ముత్తు, రావికమతం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన పద్దూరి ప్రసాద్, పాడేరు మండలం గుత్తలతపుట్టుకు చెందిన అండెంగుల రవికుమార్, చింతపల్లి మండలం లోతుగడ్డ జంక్షన్‌కు చెందిన లలిత కుమారి, జీకేమండలం పెదవలస గ్రామానికి చెందిన పొన్నగంటి మణికుమారి ఉన్నారు. నాతవరం ఎస్సై తారకేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

# ఏజెంట్ చేతిలో మోసపోయిన పశ్చిమగోదావరి మహిళ..
## స్పందించిన మంత్రి నారా లోకేశ్

ఉద్యోగం పేరుతో మోసపోయి మస్కట్‌లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన సంపూర్ణ అనే మహిళ తనను వెంటనే స్వదేశానికి రప్పించాలని వేడుకుంది. ఓ ఏజెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి మస్కట్‌కు పంపి మోసం చేసినట్లు బాధితురాలు ఆరోపిస్తోంది. ప్రస్తుతం ఆమె అక్కడ నిస్సహాయ స్థితిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై ఏపీ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఆయన తన ఆవేదనను వ్యక్తం చేస్తూ, 'పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన సంపూర్ణ ఏజెంట్ మోసంతో మస్కట్‌లో తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నారని తెలుసుకొని తీవ్రంగా కలత చెందాను. ఉద్యోగం పేరిట తప్పుడు హామీలతో మోసపోయిన తర్వాత ఏ పౌరుడూ



అసహాయంగా మిగలకూడదు. ఆమె భద్రతతో పాటు త్వరగా స్వదేశానికి రప్పించేలా సంబంధిత అధికారులతో వెంటనే సమన్వయం చేయాలని నా బృందాన్ని కోరాను. అవసరమైన అన్ని సహాయ చర్యలు అందిస్తాం' అని పేర్కొన్నారు. మంత్రి ఆదేశాలతో అధికారులు బాధితురాలిని సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడంపై చర్యలు ప్రారంభించినట్లు సమాచారం.

# 2026 నాటికి వెలిగొండ పూర్తి.. మంత్రి నిమ్మల ధీమా

వెలిగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. నూతన సంవత్సరంలో జాతికి అంకితం చేయాలని భావిస్తోంది. ఈ మేరకు పనుల్లో వేగం పెంచింది. వెలిగొండ పనుల పురోగతిపై ప్రాజెక్ట్ అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మక వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి 2026 నాటికి నీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. 2026 జూన్ నాటికి లైనింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సీజన్ మొదలయ్యే నాటికి పనులన్నీ పూర్తి చేయాలని, 2026 జూన్ నాటికి టన్నెల్ 2లో మిగిలిన లైనింగ్ పనులు పూర్తి చేయాలని అందుకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా పనులు చేయాలని ఆదేశించారు. టన్నెల్ 2లో 7 కి.మీ లైనింగ్ పనులు చేయాల్సి ఉండగా, ఇప్పటికే 3.2 కి.మీ లైనింగ్ పనులు పూర్తయ్యాయని, మిగిలిన 3.6




కి.మీ లైనింగ్ పనులు 2026 జూన్ నాటికి పూర్తి చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించారు. మొంథా తుఫాన్ కారణంగా టన్నెల్స్ లోకి నీరు వచ్చి చేరడంతో నవంబర్ నెలలో లైనింగ్ పనులు నెమ్మదించాయని అన్నారు. డీవాటరింగ్ తరువాత పనులు మొదలుపెట్టాక డిసెంబర్ నెలలో నిర్దేశించిన 456 మీటర్ల లక్ష్యానికి గానూ, ఇప్పటి వరకు 432 మీటర్ల లైనింగ్ పనులు పూర్తి చేశామని తెలిపారు. ప్రస్తుతం నాలుగు గ్యాంట్రీ క్రేన్ లతో టన్నెల్ 2 లైనింగ్ పనులు జరుగుతుండగా, వెంటనే మరో గ్యాంట్రీ క్రేన్ కూడా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. తద్వారా లైనింగ్ పనులు నిర్దేశించుకున్న లక్ష్యానికి పూర్తయ్యేలా ఏర్పాట్లు చేయాలని ఏజెన్సీ ప్రతినిధులకు సూచించారు. టన్నెల్ 2లో చిక్కుకొన్న టన్నెల్ బోరింగ్ మెషిన్ తొలగించడానికి ఏర్పాటు చేసిన టెక్నికల్ కమిటీ నివేదికను ప్రభుత్వానికి అందజేసింది అన్నారు. ఆ నివేదిక ప్రకారం, టన్నెల్ 2 లో ఉన్న టిబిఎం ను తొలగించడానికి చర్యలు తీసుకుంటాం అని పేర్కొన్నారు. ఫీడర్ కెనాల్ లైనింగ్, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు వెంటనే మొదలుపెట్టి, సీజన్ ముగిసేలోగా పూర్తి చేయాలని అధికారులకు, ఏజెన్సీకి ఆదేశాలు జారీ చేశారు. ఈసీజన్ లోనే వెలిగొండకు నీళ్ళు విడుదల చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారని, ఆయన ఆదేశాల మేరకు 2026 నాటికి వెలిగొండ పూర్తిచేయడమే లక్ష్యంగా నిరంతరం పర్యవేక్షణ చేస్తానని స్పష్టం చేశారు.

## నిమ్మకూరులో పలు అభివృద్ధి పనులకు
# నారా భువనేశ్వరి శంకుస్థాపన

నిమ్మకూరు: కృష్ణా జిల్లా నిమ్మకూరులో ఏపీ సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పర్యటించారు. గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. రూ.6కోట్ల నాబార్డు నిధులతో నిర్మించనున్న 30 పడకల ఆస్పత్రికి ఆమె శంకుస్థాపన చేశారు. రూ.3.5 కోట్లతో నిర్మించిన బాలుర వసతి గృహాన్ని భువనేశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు



సమాజాన్ని, దేశాన్ని లీడ్ చేసేలా ఉండాలని సూచించారు. స్కూల్ చదువు పూర్తిచేసుకునే సమయానికి జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. చిన్నప్పుడు వేసవి సెలవులకు నిమ్మకూరు వచ్చేవాళ్లమని.. ఆర్టీసీ బస్సులో వెళ్లి పామర్రులో సినిమా చూసేవాళ్లమంటూ నాటి సంగతులను గుర్తుచేసుకున్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవలు అందిస్తున్నామని చెప్పారు. గ్రామంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను సీఎం, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

# తాతయ్యగుంట గంగమ్మ తల్లిని దర్శించుకున్న హోంమంత్రి

తిరుపతిలో తాతయ్యగుంట గంగమ్మ తల్లిని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత దర్శించుకున్నారు. టీటీడీ బోర్డు సభ్యురాలు, తిరుపతి జిల్లా టీడీపీ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డితో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలను జరిపించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నామన్నారు. తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటే ఎంత ఆనందం కలుగుతుందో తాతయ్య గుంట గంగమ్మ తల్లిని దర్శించుకుంటే కూడా అంతే ఆనందం కలుగుతుందన్నారు. గంగమ్మ గుడి అభివృద్ధికి ప్రభుత్వం దోహదపడుతుందని తెలియజేశారు. తిరుపతి గ్రామ దేవతగా, కోరి కొలిచిన వారి కొంగు బంగారంగా గంగమ్మ తల్లి విరాజిల్లుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ధర్మాన్ని కాపాడడంలో భాగస్వాములు కావాలన్నారు. పిల్లలకు హనుమంతుడి గొప్పతనం, అర్జునుడి నేర్పరితనం గురించి చెప్పాలన్నారు. రామాయణ మహాభారతాలపై అవగాహన కల్పించాలన్నారు. తల్లిదండ్రులు



ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. ఆచార వ్యవహారాలను పాటిస్తూ వాటిని భావి తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని అభిప్రాయపడ్డారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను ఆలయ అధికారుల నుంచి స్వీకరించారు.

# శంకర్ విలాస్ ఆర్వోబీ పనులు నిలిచిపోలేదు

**: కేంద్రమంత్రి పెమ్మసాని**

గుంటూరు: నగరంలోని శంకర్ విలాస్ ఆర్వోబీ పనులు నిలిచిపోలేదని.. కొనసాగుతున్నాయని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. రైల్వేట్రాక్‌పై ఉన్న బ్రిడ్జి తొలగింపు ప్రక్రియ రెండు, మూడు వారాల్లో మొదలవుతుందని చెప్పారు. పనులు ఒకవైపు పూర్తయిన తర్వాత.. మరోవైపు ప్రారంభమవుతాయని తెలిపారు. గుంటూరులో మీడియాతో పెమ్మసాని మాట్లాడారు. వ్యాపారులు కోరినట్లు ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం సాధ్యం కాదని.. అలా చేస్తే ఎక్కువ మంది నష్టపోతారన్నారు. స్థలాలు ఇవ్వని వ్యాపారుల నుంచి భూసేకరణ ద్వారా స్థలం సేకరిస్తామని



చెప్పారు. దీనికోసం రూ.30కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు.

# మనుషులందరికీ సౌఖ్యం.. సదుపాయాలు కావాలి



**: మోహన్ భగవత్**

మనుషులందరికీ సౌఖ్యం.. సదుపాయాలు కావాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. తిరుపతిలో జరుగుతున్న భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ లో భగవత్ ప్రసంగిస్తూ శాస్త్ర విజ్ఞానంతోనే మానవాళికి సదుపాయాలు కలుగుతాయన్నారు. సుఖం అనేది కేవలం భౌతికపరమైనది కాదని స్పష్టం చేశారు. సుఖం అనేది కేవలం మానసికపరమైనదని తెలిపారు. సుఖదు:ఖాలు తాత్కాలికమైనవని పేర్కొన్నారు. మనం పొందుతున్న సౌక్యం, సదుపాయాల్లో రెండో కోణం కూడా ఉంటుందన్నారు. మనమంతా ఈ విశ్వానికి ఎంతో కొంత రుణపడి ఉన్నామన్నారు. మానసికంగా సంతృప్తి లేకపోతే ఎంత పొందినా సుఖం కలగదన్నారు. క్షమా గుణమే మనిషిని ఉన్నత స్థితిలో నిలుపుతుందన్నారు. కొందరిలో ఎంత ఎదిగితే అంత అహంకారం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. అర్థ శాస్త్రానికి ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది ఎన్నో నిర్వచనాలు ఇచ్చారని పేర్కొన్నారు. కానీ చాణక్యుడి అర్థశాస్త్రం ప్రజల సంక్షేమానికి మాత్రమే ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. ప్రతిఒక్కరూ స్వయంగా కర్తవ్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. విజ్ఞాన శాస్త్రం, ధర్మ శాస్త్రాల మధ్య వైరుధ్యమేమి లేదన్నారు. అనుభవంతో ఎంతో విజ్ఞానాన్ని సంపాదిస్తామన్నారు. అనుభవం పాఠాలను కూడా నేర్పిస్తుందన్నారు. సరైన మార్గంలో పయనిస్తే ఏదైనా సాధ్యమని స్వామి వివేకానంద వంటి వారు బోధించిన విషయాన్ని నొక్కి చెప్పారు. మనం వెళ్లేదారి సరైనదిగా ఉండాలని స్పష్టం చేశారు. మార్గం సరైనదైతే కచ్చితంగా లక్ష్యాన్ని చేరుకోగలమన్నారు. లక్ష్యాన్ని ఎంచుకున్నప్పుడు మార్గాన్ని కూడా ముందుగానే నిర్దేశించుకోవాలని సూచించారు. ప్రపంచ వేగంగా ముందుకెళ్తోన్న తరుణం పోటీ పడాలంటే సాధన ఎంతో అవసరం అన్నారు. సాధన చేసేందుకు ఏకాగ్రత తప్పనిసరని తెలిపారు. వ్యక్తులకు విద్యతో పాటు క్రమశిక్షణ కూడా అలవడాలన్నారు. నియంత్రణతో ఏ పనైనా సులువుగా సాధించొచ్చని తెలియజేశారు.

## మెడికల్ అన్‌ఫిట్ ఆర్టీసీ ఉద్యోగులకు
# ఏపీ ప్రభుత్వం తీపి కబురు




అమరావతి: మెడికల్ అన్‌ఫిట్ అయిన ఆర్టీసీ ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం తీపికబురు చెప్పింది. వారికి ప్రత్యామ్నాయ ఉద్యోగాలివ్వాలని నిర్ణయించింది. ప్రభుత్వంలో సంస్థ విలీనం అనంతరం నుంచి ఈ చర్యలు చేపట్టాలని ఆదేశించింది. దీంతో 2020 జనవరి 1 తర్వాత మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది.

# ఐదేళ్లలో ఈ నగరాల నుంచి రైళ్ల సామర్థ్యం డబుల్.. తెలుగు రాష్ట్రాల్లోని స్టేషన్లు ఇవే!

దిల్లీ: దేశంలో పెరుగుతున్న రైలు ప్రయాణికులకు అనుగుణంగా రైళ్ల సామర్థ్యాన్ని పెంచే దిశగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోని 48 ప్రధాన నగరాల నుంచి బయల్దేరే రైళ్ల సామర్థ్యాన్ని రాబోయే ఐదేళ్లలో రెట్టింపు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. రాబోయే సంవత్సరాల అవసరాలను తీర్చేందుకు ప్రస్తుత మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయాల్సి ఉందని రైల్వే మంత్రిత్వ శాఖ అభిప్రాయపడింది. రైల్వే శాఖ




ప్రణాళికలో తెలుగు రాష్ట్రాల నుంచి హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి రైల్వే స్టేషన్లు ఉన్నాయి. 2030 నాటికి ఈ సామర్థ్యాన్ని రెట్టింపు చేయడంలో భాగంగా ప్రస్తుత టర్మినల్స్‌లో అదనపు ప్లాట్‌ఫారాలు నిర్మించడం, నగరాల చుట్టుపక్కల కొత్త టర్మినల్స్ ఏర్పాటు, నిర్వహణ సౌకర్యాలు మెరుగుపరచడం, సెక్షనల్ కెపాసిటీ పెంచడం వంటివి ఉన్నాయని రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది. దేశవ్యాప్తంగా 48 ప్రధాన నగరాల స్టేషన్లకు సంబంధించిన సమగ్ర ప్రణాళికను రైల్వే ప్లానింగ్ డైరెక్టరేట్‌కు సమర్పించనున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతితో పాటు దిల్లీ, ముంబయి, చెన్నై, బెంగళూరు, పట్నా, పుణె, వంటి స్టేషన్లు ఉన్నాయి. ఈ ప్రణాళికలో ఇప్పటికే ఆమోదం పొందిన, ప్రతిపాదిత ప్రణాళికలు ఉంటే వాటిని కూడా ఇందులో చేర్చి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది.

## గాలిపటం మాంజా తగిలి..
# యువకుడి మెడకు 19 కుట్లు

హైదరాబాద్: గాలిపటం మాంజా తగిలి యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన మేడ్చల్ జిల్లా కీసరలో జరిగింది. ద్విచక్ర వాహనంపై వ్యవసాయ పొలం వద్దకు వెళ్తున్న జశ్వంత్‌రెడ్డి మెడకు మాంజా చుట్టుకుంది. దీంతో మెడపై తీవ్రగాయం కావడంతో స్థానికులు హుటాహుటిన బాధితుడిని కీసరలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు జశ్వంత్‌రెడ్డి మెడకు 19 కుట్లు వేశారు. సంక్రాంతి నేపథ్యంలో కీసరలో దొంగచాటుగా నిషేధిత మాంజా విక్రయాలు జరుపుతున్నారని, పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# న్యూ ఇయర్ వేళ నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్సులు రద్దు

హైదరాబాద్: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నగరంలో డ్రగ్స్ కట్టడిపై హైదరాబాద్ నగర పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. 'జీరో డ్రగ్స్' విధానమే లక్ష్యంగా కఠిన చర్యలు చేపట్టాలని నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ అధికారులను ఆదేశించారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం ఆయన హెచ్‌న్యూ, టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్, వెస్ట్‌జోన్, సీసీఎస్ తదితర విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా డ్రగ్స్ వినియోగాన్ని ఉపేక్షించేది



లేదని స్పష్టం చేశారు. ''ఇవాళ్టి నుంచే నగరంలోని పబ్‌లు, హోటళ్లు రెస్టారెంట్లు, ఈవెంట్లు జరిగే ప్రదేశాల్లో ప్రత్యేక నిఘా బృందాలను మోహరించాం. ప్రధాన వేదికలతో పాటు సర్వీస్ అపార్ట్‌మెంట్లు, హాస్టళ్లలో జరిగే ప్రైవేట్ పార్టీలపైనా నిఘా ఉంటుంది. గత రెండేళ్లలో డ్రగ్స్ కేసుల్లో నిందితులుగా ఉన్నవారి కదలికలను నిశితంగా గమనిస్తున్నాం. డ్రగ్స్ సరఫరా చేసేవారు, వాటికి అలవాటు పడిన వారి జాబితా సిద్ధం చేసి వారిపై నిరంతర నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించాం. నగరానికి కొత్తగా వచ్చేవారి వివరాలనూ ఆరా తీస్తున్నాం'' అని సీపీ తెలిపారు.

### వేడుకల సమయపాలనపై హెచ్చరిక

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పబ్‌లు, హోటళ్లు, రెస్టారెంట్లు కచ్చితంగా రాత్రి 1 గంటకే మూసివేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే వాటి లైసెన్సులను రద్దు చేస్తామని తేల్చిచెప్పారు. మైత్రీవనం, నెక్లెస్ రోడ్డు, ట్యాంక్‌బండ్, కేబీఆర్ పార్క్ సహా జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లో చెక్‌పోస్టులు, బారికేడింగ్ ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. సర్వీస్ అపార్ట్‌మెంట్లు, హాస్టళ్లలో జరిగే ప్రైవేట్ వేడుకలపై కూడా నిఘా ఉంచాలని అధికారులకు సూచించారు. నిఘా పేరుతో సామాన్య ప్రజలకు ఎలాంటి ఆటంకం కలగకుండా, వేడుకలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని పేర్కొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసు..
## ఆరా మస్తాన్‌ను రెండోసారి విచారించిన సిట్

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక సాక్షి ఆరా మస్తాన్ సిట్ విచారణ ముగిసింది. రెండున్నర గంటల పాటు మస్తాన్‌ను విచారించిన ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు రెండో సారి ఆయన స్టేట్‌మెంట్‌ను నమోదు చేశారు. విచారణ అనంతరం ఆరా మస్తాన్ మాట్లాడుతూ.. గతంలో తాను చెప్పిన వివరాలనే సిట్ అధికారులు మళ్లీ అడిగారని, తనకు తెలిసిన అన్ని అంశాలను స్పష్టంగా చెప్పానన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావు వెల్లడించిన అంశాలను క్రాస్ చెక్ చేసుకునేందుకే తనను



మరోసారి విచారణకు పిలిచారని తెలిపారు. సిట్ అధికారులు తన ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన డేటాను తన ముందే ఉంచారని, ఆ డేటా ప్రకారం 2020 నుంచే తన రెండు ఫోన్లు ట్యాప్ అయినట్లు పేర్కొన్నారని ఆరా మస్తాన్ చెప్పారు. ముఖ్యమైన సాక్షులను సిట్ విచారిస్తోందని, ఉన్నత స్థాయి అధికారులతో సిట్ ఏర్పాటు చేయడంతో దర్యాప్తు తుది దశకు చేరుకుందని అభిప్రాయపడ్డారు. వారం రోజుల్లో మళ్లీ విచారణకు పిలిచే అవకాశముందని తెలిపారు. ఈ కేసు త్వరలోనే ముగింపు దశకు చేరుకుంటుందని మస్తాన్ అన్నారు.

# హైదరాబాద్ ప్రజలకు పాదాభివందనం చేసినా తక్కువే

**: కేటీఆర్**

హైదరాబాద్: మేడిగడ్డను కూల్చివేసిన కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడు చెక్‌డ్యామ్‌లను పేల్చివేస్తున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ (KTR) ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నది కూల్చివేతలు, పేల్చివేతలు, ఎగవేతలు మాత్రమేనని వ్యాఖ్యానించారు. శేరిలింగంపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు నేడు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ''ఎన్నో హామీలిచ్చిన రేవంత్‌రెడ్డి అన్నీ ఎగవేశారు. ఆయన కిస్మత్ బాగుండి పేమెంట్ కోటాలో సీఎం అయ్యారు. హామీల గురించి ప్రశ్నిస్తే రేవంత్ బూతులు తిడుతున్నారు. తిట్ల భాష మాకూ వచ్చు.. కానీ మేం తిట్టం. పెంచుతామన్న పింఛన్లు ఎప్పటి నుంచి ఇస్తారో సీఎం చెప్పాలి. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను వరుసగా రెండుసార్లు గెలిపించారు. హైదరాబాద్ ప్రజలకు నేను పాదాభివందనం చేసినా తక్కువే. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే రేవంత్ తట్టుకోలేరు'' అని కేటీఆర్ అన్నారు.





## వేములవాడ రాజన్న ఆలయానికి
# పోటెత్తిన భక్తులు

వేములవాడ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన భీమేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు ముందు భక్తులు వేములవాడ రాజన్నకు కోడె మొక్కులతో పాటు వివిధ ఆర్జిత సేవల మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దీనికి తోడు వరుస సెలవులు రావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కులు చెల్లించుకొని అభిషేకాలు నిర్వహించారు. అనంతరం బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని బోనాలు, పట్నం మొక్కులు చెల్లించారు. దీంతో క్యూలైన్లతో పాటు ఆలయ పరిసరాలు భక్తజనసంద్రంగా మారాయి. స్వామివారి దర్శనానికి 5గంటలకు పైగా సమయం పడుతోంది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను ఈవో రమాదేవి పర్యవేక్షించారు. ఏఎస్పీ రిత్విక్ సాయి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

# వీరబాలల త్యాగం దేశానికి స్ఫూర్తిదాయకం

**: ఎన్.రాంచందర్ రావు**

దేశం, ధర్మం, భారతీయ సంస్కృతి రక్షణ కోసం ప్రాణాలర్పించిన గురు గోవింద్ సింగ్ జీ చిన్న కుమారులు బాబా జోరావర్ సింగ్, బాబా ఫతే సింగ్‌ల త్యాగం చిరస్మరణీయమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పేర్కొన్నారు. శుక్రవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వీర బాల్ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వీరబాలల చిత్రపటాలకు నివాళులర్పించి, వారి బలిదానాన్ని స్మరించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కేవలం



7, 9 ఏళ్ల ప్రాయంలోనే మొఘలుల అరాచకాలను ఎదిరించి, మతం మారే ప్రసక్తే లేదని ప్రాణాలర్పించిన ఆ చిన్నారుల ధైర్యం రాబోయే తరాలకు మార్గదర్శకమని కొనియాడారు. 2022లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ డిసెంబర్ 26ను వీర బాల్ దివస్‌గా ప్రకటించడం ద్వారా సిక్కు పంత్ త్యాగాలకు దేశవ్యాప్త గౌరవం దక్కిందని ఆయన తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో సిక్కు సమాజానికి చారిత్రక న్యాయం జరిగిందని రాంచందర్ రావు వివరించారు. వందల కోట్ల వ్యయంతో కారిడార్‌ను పూర్తి చేసి పాకిస్థాన్‌లోని పవిత్ర గురుద్వారాల సందర్శనకు వీలు కల్పించారన్నారు. గురుద్వారాల్లో జరిగే లంగర్ సరుకులపై పన్నులు తొలగించడం ద్వారా సిక్కు సమాజానికి రూ. 325 కోట్ల ఆర్థిక భారం తగ్గిందన్నారు. సిక్కు విద్యార్థులకు గతంలో ఉన్న రూ. 18 కోట్ల విద్యా సహాయాన్ని మోదీ ప్రభుత్వం రూ. 31 కోట్లకు పెంచిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన సిక్కుల మారణహోమంపై ప్రత్యేక సిట్ ఏర్పాటు చేసి, దోషులను శిక్షించేలా మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు గురుద్వారాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అంతకుముందు రాంచందర్ రావు సికింద్రాబాద్‌లోని గురుద్వారాను సందర్శించి నివాళులర్పించారు. పార్టీ కార్యాలయంలో కీర్తనలు, ప్రత్యేక సమావేశం నిర్వహించి వీరబాలల స్ఫూర్తిని చాటారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పురపాలికల విలీనంతో బృహత్ నగరంగా హైదరాబాద్

జీహెచ్‌ఎంసీ వార్డుల పునర్విభజనకు సంబంధించిన ఫైనల్ నోటిఫికేషన్ జారీ చేయడంతోపాటు సర్కిల్, జోన్లను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పడిన గోల్కొండ, రాజేంద్రనగర్ జోన్లకు సంబంధించిన ఆఫీసులను జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ రెండు జోన్ల కమిషనర్లు అనురాగ్ జయంతి, ముకుంద్ రెడ్డి కమిషనర్ కర్ణన్ సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు కమిషనర్ కర్ణన్‌కు పూల బొకేలతో జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, ముకుంద్ రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కమిషనర్ కర్ణన్ మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీలో 27 పురపాలికల విలీనంతో హైదరాబాద్ బృహత్ నగరంగా ఆవిర్భవించిందని అన్నారు. విలీనంతో నగర విస్తీర్ణం 650 చదరపు కిలో మీటర్ల నుండి 2053 చదరపు కిలో మీటర్లకు విస్తరించిందన్నారు. విస్తీర్ణం పెరగడంతో పాలనా సౌలభ్యం కోసం ప్రభుత్వం జీహెచ్‌ఎంసీ వార్డులను 150 నుండి 300కు పెంచిందన్నారు జీహెచ్‌ఎంసీ లో ప్రస్తుతం ఉన్న 6 జోన్లను 12కు, ప్రస్తుతం 30 ఉన్న సర్కిళ్లను 60కి పెంచడం జరిగిందన్నారు. జీహెచ్‌ఎంసీలో కొత్త జోన్లుగా ఉప్పల్, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, శంషాబాద్, గోల్కొండ, రాజేంద్రనగర్ లు ఏర్పాటు అయ్యాయని చెప్పారు. అదనంగా జోనల్, సర్కిల్ కార్యాలయాల ఏర్పాటుతో ప్రజలకు పౌర సేవలు వేగంగా, సులభంగా అందుతాయని చెప్పారు. అభివృద్ధి మరింతగా వేగంగా జరుగుతుందని చెప్పారు.

## సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం.. కేసీఆర్‌కు గుబులు మొదలైంది: మంత్రి వివేక్

గజ్వేల్: సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని 90కి పైగా స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచి అభ్యర్థులు గెలవడంతో కేసీఆర్ గుండెల్లో గుబులు మొదలైందని మంత్రి వివేక్ అన్నారు. అందుకే ఆయన ఇష్టానుసారం మాట్లాడుతున్నారని విమర్శించారు. ''కేసీఆర్ తనను గెలిపించిన గజ్వేల్ ప్రజల సమస్యలు పట్టించుకోలేదు కానీ తోలు తీస్తాడట. గతంలో కంటే ఎక్కువగా దుబ్బాకలో 56 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారు. పార్టీ కార్యకర్తల కష్టం వల్లే ఇన్ని స్థానాలు గెలుపొందాం. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం పథకాలపై ప్రజల్లో మంచి స్పందన ఉంది. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌కు బలం లేదు అన్నారు..

## శాసనసభ నూతన కార్యదర్శిగా రేండ్ల తిరుపతి బాధ్యతల స్వీకరణ..

*** స్పీకర్ అభినందనలు**

తెలంగాణ రాష్ట్ర శాసనసభ నూతన కార్యదర్శిగా రేండ్ల తిరుపతి శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు శాసనసభ కార్యదర్శిగా సేవలందించిన వి. నరసింహాచార్యులు నుండి ఆయన అసెంబ్లీలోని కార్యదర్శి ఛాంబర్‌లో బాధ్యతలను స్వీకరించారు. పదవీ



బాధ్యతలు స్వీకరించిన అనంతరం కార్యదర్శి తిరుపతి, శాసన మండలి కార్యదర్శి వి. నరసింహాచార్యులు కలిసి శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఆయన అధికార నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ నూతన కార్యదర్శి తిరుపతికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కొత్త బాధ్యతల్లో ఆయన విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం, ఇప్పటివరకు అసెంబ్లీ కార్యదర్శిగా ఉన్న వి. నరసింహాచార్యులు ఇకపై శాసన మండలి కార్యదర్శిగా తన సేవలను కొనసాగించనున్నారు.

# 16 ఏళ్లలోపు వారికి సోషల్‌మీడియా బ్యాన్.. మదురై బెంచ్ కీలక వ్యాఖ్యలు

మదురై: చిన్నారుల సామాజిక మాధ్యమాల వినియోగంపై మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ కీలక వ్యాఖ్యలు చేసింది. ఆస్ట్రేలియా తరహాలో 16 ఏళ్లలోపు చిన్నారులు సోషల్‌మీడియా నిషేధించే అంశాన్ని పరిశీలించాలని కేంద్రానికి సూచించింది. ఎస్ విజయ్ కుమార్ అనే వ్యక్తి దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఇంటర్నెట్‌లో యథేచ్ఛగా అశ్లీల చిత్రాలు లభిస్తున్నాయని,



వీటిని ఎవరైనా చూసే వీలుందని పిటిషనర్ తన వ్యాజ్యంలో పేర్కొన్నారు. ఇవి చిన్నారుల జీవితాన్ని ప్రమాదంలో పడేస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా ఎవరిపడితే వారు అశ్లీల చిత్రాలు, వీడియోలు చూడకుండా సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు ఇవ్వాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. దీనిపై జస్టిస్ జి.జయచంద్రన్, జస్టిస్ కేకే రామకృష్ణన్‌తో కూడిన ధర్మాసనం కీలక ఆదేశాలు ఇచ్చింది. పోర్నోగ్రఫీ కంటెంట్ చూడకుండా సాఫ్ట్‌వేర్ తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందని అభిప్రాయపడింది. అలాగే, ఆస్ట్రేలియా తరహాలో 16 ఏళ్లలోపు వారు సామాజిక మాధ్యమాలు వినియోగించకుండా నిషేధం అంశాన్ని పరిశీలించాలని కేంద్రానికి సూచించింది. అప్పటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, బాలల హక్కుల కమిషన్ దీనిపై అవగాహన కల్పించే బాధ్యతను తీసుకోవాలని ధర్మాసనం పేర్కొంది.

## ఎర్రకోట ఘటనలో
## 40కిలోల పేలుడు పదార్థాలు అమిత్ షా

ఢిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడు ఘటనలో 40 కిలలో పేలుడు పదార్థాలు వాడినట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెల్లడించారు. ఈ కేసులో జమ్మూ కశ్మీర్ పోలీసులు అద్భుతమైన దర్యాప్తు జరిపారని, పేలుడుకు ముందే మూడు టన్నుల పదార్థాలను స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. ఢిల్లీ ఘటనకు ముందే కుట్రలో పాల్గొన్న వారందర్నీ అరెస్టు చేశారన్నారు. ఢిల్లీలో యాంటీ టెర్రరిజం కాన్ఫరెన్స్2025ను ప్రారంభించిన అమిత్ షా..వ్యవస్థీకృత నేరాలపై అన్ని కోణాల్లో ఉక్కుపాదం మోపేందుకు కొత్త ప్రణాళికను ప్రభుత్వం తీసుకువస్తుందన్నారు. అత్యంత ముఖ్యమైన ఏటీఎస్ విధానాన్ని సాధ్యమైనంత త్వరగా దేశమంతా అమలు చేయాలని ఈ సందర్భంగా అన్ని రాష్ట్రాల



డీజీపీలకు సూచించారు. కేంద్ర సంస్థలు, రాష్ట్ర పోలీసులు సాంకేతికతను ఆయా స్థాయిలో సమర్థంగా వినియోగించుకుంటున్నాయన్నారు. అయితే, సాంకేతికత, డేటా ఒకదానికొకటి అనుసంధానం కాకపోవడం తుపాకీ లేని బుల్లెట్ లాంటిదేనని అన్నారు.

## జలాంతర్గామిలో ప్రయాణించనున్న రాష్ట్రపతి

దేశ ప్రథమ పౌరురాలు, త్రివిధ దళాల సుప్రీం కమాండర్ ద్రౌపదీ ముర్ము జలాంతర్గామిలో ప్రయాణించనున్నారు. డిసెంబరు 28న కర్ణాటకలోని కర్వార్ హార్బర్ నుంచి ప్రయాణం సాగించనున్నారు. ఈ విషయాన్ని శుక్రవారం రాష్ట్రపతి భవన్ ప్రకటించింది. శనివారం నుంచి నాలుగు రోజుల పాటు ఆమె గోవా, ఝార్ఖండ్, కర్ణాటకలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలోనే జలాంతర్గామిలో ప్రయాణించనున్నారు. రెండు నెలల క్రితం కూడా రాష్ట్రపతి ఇలాంటి సాహసమే చేశారు. రఫేల్ యుద్ధ విమానంలో గగన విహారం చేశారు. హరియాణాలోని అంబాలా వైమానిక స్థావరం నుంచి రఫేల్ లో ప్రయాణించిన సంగతి తెలిసిందే. ఇక, 2023 మే 8న ద్రౌపదీ ముర్ము అస్సాంలోని తేజ్‌పుర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి సుఖోయ్30 ఎంకేఐ యుద్ధ విమానంలో విహరించారు. ఈ ప్రయాణం చేసిన రెండో మహిళా రాష్ట్రపతిగా ఆమె గుర్తింపు సాధించారు. అంతకుముందు 2009లో అప్పటి రాష్ట్రపతి



ప్రతిభా పాటిల్ ఇదే ఫైటర్‌జెట్‌లో గగనయానం చేశారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం కూడా 2006లో పుణె వాయుసేన స్థావరం నుంచి సుఖోయ్30 యుద్ధ విమానంలో విహరించారు.

## శబరిమలలో భక్తుల రద్దీ..
## అయ్యప్పను దర్శించుకున్న 30లక్షల మంది

శబరిమల ఆలయానికి ఈసారి కూడా భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 30లక్షల మందికి పైగా దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి. అయితే, గతేడాది ఇదే సమయంతో పోలిస్తే రెండు లక్షలు తగ్గినట్లు తెలిసింది. ఈ ఏడాది నవంబర్ 19న అత్యధికంగా 1.02లక్షల మంది దర్శించుకోగా.. డిసెంబర్ 12న అత్యల్పంగా 49వేల మంది ఆలయానికి వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఏడాది



ప్రారంభం నుంచి భక్తుల రద్దీ ఉండడంతో అధికారులు కఠిన నిబంధనలు విధించారు. హైకోర్టు ఆదేశాల మేరకు వర్చువల్ క్యూ, స్పాట్ బుకింగ్‌లపై పరిమితి విధించి రద్దీని నియంత్రించారు. గతంతో పోలిస్తే ఆదివారాల్లో రద్దీ తక్కువగా ఉంటోందని, ఇతర రోజుల్లో నిత్యం 80వేలకు పైగా భక్తులు ఆలయానికి వస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. మండలపూజ సందర్భంగా డిసెంబర్ 26, 27 తేదీల్లో వర్చువల్ క్యూలైన్‌ల ద్వారా భక్తుల సంఖ్యను పరిమితం చేశారు.

## బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు.. ఖండించిన భారత్



పొరుగుదేశం బంగ్లాదేశ్‌లో అస్థిర పరిస్థితులు నెలకొన్నాయి. ఆ దేశంలో మైనార్టీ ప్రజలను లక్ష్యంగా చేసుకొని జరుగుతోన్న హింసాత్మక ఘటనలపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ''అతివాద శక్తులు కొనసాగిస్తోన్న ఇలాంటి చర్యలను ఖండిస్తున్నాం. రాజకీయ హింస, మీడియా ప్రచారం అని చెప్పి ఆ ఘటనలను మేం విస్మరించలేం'' అని విదేశాంగశాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. యువ నాయకుడు, ఇంకిలాబ్ మోంచో నేత షరీఫ్ ఉస్మాన్ హాదీ హత్యతో ఇటీవల బంగ్లాదేశ్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. ఆ ఘర్షణల్లోనే బంగ్లాదేశ్‌లోని మయమన్‌సింగ్ జిల్లాలో 25 ఏళ్ల దీపూ చంద్ర దాస్‌పై మూకదాడి, హత్య జరిగింది. అది మరవకముందే మరో మైనారిటీ యువకుడిని గ్రామస్థులు కొట్టి చంపారు. రాజ్‌బరి జిల్లా పంగ్షా సర్కిల్‌లో బుధవారం రాత్రి ఆ ఘటన చోటుచేసుకుందని స్థానిక మీడియా వెల్లడించింది. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున అతడు మృతి చెందాడు. ఈ ఘటనలకు పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెడతారని భావిస్తున్నట్లు జైస్వాల్ వెల్లడించారు.

*** ఆర్థిక నేరగాళ్లను వెనక్కి రప్పించేలా..**

బ్యాంకులకు రూ. వేల కోట్లు మోసగించి విదేశాలకు పారిపోయిన ఆర్థిక నేరగాళ్లను వెనక్కి రప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని జైస్వాల్ వెల్లడించారు. ఆర్థిక నేరగాళ్లు విజయ్ మాల్యా, లలిత్ మోదీ ఒక ప్రైవేట్ పార్టీలో పాల్గొన్న వీడియో ఇటీవల నెట్టింట్లో చక్కర్లు కొట్టింది. అందులో వారు భారత్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో రణధీర్ జైస్వాల్ స్పందిస్తూ.. వారిని వెనక్కి రప్పించేందుకు ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో ఉందని పునరుద్ఘాటించారు.

## అతి చిన్న రోబోను సృష్టించిన పరిశోధకులు!



అమెరికాలోని పెన్సిల్వేనియా యూనివర్సిటీ, మిషిగన్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు అతిసూక్ష్మ రోబోలను సృష్టించారు. ఇవి అత్యంత తక్కువ సైజులో (200x300x50 మైక్రోమీటర్ల) ఉండటం గమనార్హం. అందుకే వీటిని ప్రపంచంలో అత్యంత సూక్ష్మ, స్వతంత్ర రోబోలుగా చెబుతున్నారు. కాంతి ద్వారా శక్తిని పొందే ఈ చిట్టి రోబోలు స్థానిక ఉష్ణోగ్రతలను పసిగట్టి ముందుకు కదులుతాయి. కణాల ఆరోగ్యాన్ని పర్యవేక్షించే సామర్థ్యం వీటి సొంతం. అతి చిన్న పరికరాలను రూపొందించడంలో ఇవి కీలకంగా మారనున్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు.న్యూటన్ మూడో గమన నియమం ఆధారంగా.. రోబో తన చుట్టుపక్కల ఉండే ద్రావణంలో విద్యుత్ క్షేత్రాన్ని సృష్టిస్తుంది. తద్వారా నీటి అణువులను నెట్టి ముందుకు కదులుతాయి. ఎల్ఈడీ కాంతితోనూ ఛార్జింగ్ అయ్యే వీలుంది. ఎలక్ట్రానిక్ సెన్సార్లు ఉంటాయి. తక్కువ ఓల్టేజీ వద్ద పనిచేసే ఈ రోబోల తయారీకి అయ్యే ఖర్చు కూడా తక్కువేనట. ఎక్కువ భాగం సోలార్ ప్యానెల్ ఆక్రమిస్తుండగా.. మిగిలిన ప్రదేశంలోనే కీలకమైన ప్రాసెసర్, మెమొరీలను పొందుపరిచారు. మొత్తంగా దేనినైనా పసిగట్టి, స్వతహాగా పనిచేసే విధంగా పెన్సిల్వేనియా మిషిగన్ విశ్వవిద్యాలయాల పరిశోధకులు వీటిని తీర్చిదిద్దారు.

## స్క్రీన్ టైమ్ తగ్గించేలా.. పేపర్ చదివేలా
## : యూపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

లఖ్‌నవూ: విద్యార్థులకు సంబంధించి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని సెకండరీ, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు వార్తా పత్రికలు చదవడాన్ని తప్పనిసరి చేసింది. ఈ మేరకు మార్గదర్శకాలు జారీ చేసింది. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచేందుకు, డిజిటల్ స్క్రీన్ టైమ్‌ను తగ్గించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకుంది. విద్యార్థుల కోసం పాఠశాలల గ్రంథాలయాల్లో హిందీ, ఇంగ్లీష్ పేపర్లను అందుబాటులో ఉంచనున్నారు. ''ఉదయం స్కూల్ అసెంబ్లీలో కనీసం పది నిమిషాలు వార్తాపత్రిక చదవడానికి కేటాయించాలి. జాతీయ, అంతర్జాతీయ, క్రీడా రంగాలకు సంబంధించి కీలక అంశాలను విద్యార్థులు చదవాలి. అలాగే వార్తా పత్రికల నుంచి కఠినమైన ఐదు పదాలను ఎంపిక చేసి, నోటీసు బోర్డుపై ప్రదర్శించాలి. ఈ 'వర్డ్ ఆఫ్ ది డే' ప్రక్రియ ద్వారా పదసంపద మెరుగవుతుంది. పేపర్ రీడింగ్ వల్ల విద్యార్థుల్లో జనరల్ నాలెడ్జ్, క్రిటికల్ థింకింగ్, ఏకాగ్రత పెరుగుతుంది. అంతేగాకుండా పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి దోహదపడుతుంది. నకిలీ వార్తలకు చెక్ పెట్టడానికి ఉపకరిస్తుంది. వార్తా పత్రికలు చదవడంతో పాటు సొంతంగా స్కూల్ న్యూస్‌పేపర్లు, మ్యాగజైన్లు ప్రచురించేలా



విద్యార్థులను ప్రోత్సహించాలి. క్రాస్‌వర్డ్స్, సుడోకు వంటి పోటీలు నిర్వహించాలి. పత్రికల్లోని కటింగ్‌లను ఉపయోగించి స్క్రాప్ బుక్‌లు సిద్ధం చేసుకునేలా ప్రైమరీ స్థాయి విద్యార్థులను ప్రోత్సహించాలి'' అని ప్రభుత్వం తన మార్గదర్శకాల్లో పేర్కొంది.

## ఎయిర్ ప్యూరిఫైయర్లపై జీఎస్టీ తగ్గింపు అంశం..
## కేంద్రానికి 10 రోజుల గడువు

ఎయిర్ ప్యూరిఫైయర్లపై జీఎస్టీ తగ్గించే అంశంపై వివరణాత్మక స్పందన తెలియజేసేందుకు కేంద్రానికి ఢిల్లీ హైకోర్టు 10 రోజుల గడువు విధించింది. దేశ రాజధానిలో గాలి నాణ్యత క్షీణిస్తున్నందున ఎయిర్ ప్యూరిఫైయర్లను వైద్య పరికరంగా పరిగణించి.. వాటిని 5శాతం జీఎస్టీ శ్లాబులోకి తీసుకొచ్చేలా ఆదేశాలివ్వాలంటూ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైన సంగతి తెలిసిందే. దీనిపై నేడు మరోసారి విచారణ జరిపిన న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వానికి ఈ ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను జనవరి 9వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. నేటి విచారణ సందర్భంగా కేంద్రం తీరుపై న్యాయస్థానం అసహనం వ్యక్తం చేసింది. ప్రస్తుతం ఎయిర్ ప్యూరిఫైయర్ల ధర రూ.10-15వేలు ఉందని.. సామాన్యులు అంత డబ్బు పెట్టి ఎలా కొనుగోలు చేస్తారని ప్రశ్నించింది. దీనిపై నిర్ణయం తీసుకోవడంలో జీఎస్టీ మండలికి ఇబ్బందేంటని ఆగ్రహం వ్యక్తం చేసింది. అనంతరం కేంద్రం తరఫు న్యాయవాది వాదిస్తూ.. పిటిషనర్ తన వ్యాజ్యంలో ఆరోగ్య మంత్రిత్వ శాఖను ప్రస్తావించకపోవడాన్ని తప్పుబట్టారు. ఈ పిటిషన్ ద్వారా ఎవరికి ప్రయోజనం చేకూర్చాలనుకుంటున్నారో తెలియట్లేదని.. పిటిషనర్ ఉద్దేశం గురించి తెలుసుకోవడానికి అనేక విషయాలపై దర్యాప్తు చేపట్టాల్సిన అవసరం ఉందని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు.

## వికసిత్ భారత్ లక్ష్యం..జెన్‌జీ తోనే సాధ్యం: ప్రధాని మోదీ

జెన్ జీ యువత ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాల్లో అద్భుతాలు సృష్టిస్తున్నారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. వారి సామర్థ్యాలు, క్రమశిక్షణ, కష్టపడే తత్వంతో వికసిత్ భారత్ లక్ష్యాన్ని నెరవేరుస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఎవరు చిన్న, ఎవరు పెద్ద అనే విషయాన్ని వయసు నిర్ణయించదని.. మనం చేసే పనులు, సాధించే విజయాలే నిర్ణయిస్తాయని అన్నారు. చిన్న వయసులో కూడా ఇతరులు మన నుంచి ప్రేరణ పొందేలా అనేక పనులు చేయవచ్చని 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్' కార్యక్రమానికి హాజరైన బాలలకు ప్రధాని సూచించారు. తాత్కాలికంగా వచ్చే ఆకర్షణలు, పాపులారిటీకి లొంగిపోకుండా.. దేశాభివృద్ధికి పాటుపడిన గొప్ప వ్యక్తుల జీవితం నుంచి మంచి విషయాలు నేర్చుకోవాలని ప్రధాని



మోదీ సూచించారు. ఏ విషయంలో అయినా అనుమానాలు, సందేహాలు వచ్చినప్పుడు పెద్దవారిని సంప్రదించాలని సూచించారు. యువతే దేశానికి చోదక శక్తి అని.. దేశాభివృద్ధిలో రానున్న 25 సంవత్సరాలు చాలా కీలకమని పునరుద్ఘాటించారు. వారి కలలు, ఆకాంక్షలే భారతదేశ దశ, దిశలను నిర్ణయిస్తాయని అన్నారు. వాళ్ల అభిరుచులే దేశాభివృద్ధికి మార్గం చూపిస్తాయని చెప్పారు. యువత తాము సాధించే విజయాన్ని తమ విజయంగా కాకుండా దేశం సాధించిన విజయంగా భావించాలన్నారు. అదే లక్ష్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు. యువత అన్ని రంగాల్లో ముందుకు వెళ్లే విధంగా తమ ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు.

# గంటల పూలు... సీతాకోక చిలుకలు!





**చూడ్డానికి గంటల్లా... లాంతర్లలా కనిపించే ఫ్లవరింగ్ మేపల్ పూల మొక్క... పెంచుకునే ప్రదేశానికి కళ తెచ్చిపెడుతుంది. మరి దీన్ని మన ఇంటి ముందు నాటుకుంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటో తెలుసా?**




ఫ్లవరింగ్ మేపల్ మొక్క శాస్త్రీయ నామం అబుటిలాన్ పిక్టమ్. ఇది మాల్వేసి (మాలో) కుటుంబానికి చెందినది. భారతదేశంతో సహా ఉష్ణమండల, ఉప ఉష్ణమండల ప్రాంతాలలో అలంకార మొక్కగా ప్రాచుర్యంలో ఉంది. దీన్నే ఇండియన్ మాలో, చైనీస్ లాంతర్ అనే పేర్లతోనూ పిలుస్తారు. 24 సెం.మీ.ల పొడవు, ఐదు రేకలతో పొడవైన కాండాలపై వేలాడుతూ కనిపిస్తాయి. ఇవి దక్షిణ భారతదేశంలో ఏడాది పొడవునా వికసిస్తాయి. పసుపు, ఎరుపు, కాషాయం, తెలుపు... వంటి రంగుల్లో కనువిందు చేస్తాయి. పైన ముదురు ఎరుపు గీతలు పెయింట్ లుక్‌ని తెస్తాయి.

**సంరక్షణ ఇలా...**

గుబురుగా పెరిగే ఈ పూల మొక్క చక్కగా ఎదగాలంటే రోజూ 68గంటల సూర్యరశ్మి అవసరం. అది నాటుకునే ప్రదేశంలో గాలి బాగా వీచేలా చూసుకోవాలి. పొడిగా ఉండే సారవంతమైన నేలల్లో నాటుకోవాలి. ఆ మట్టిలో కాస్త ఇసుక, కంపోస్ట్ కలిపితే ఆరోగ్యంగా ఎదుగుతుంది. కొత్త కొమ్మలను గిల్లితే... పూలు ఎక్కువగా వస్తాయి. ఎండిపోయిన, చనిపోయిన కొమ్మల్ని ఎప్పటికప్పుడు తొలగించండి. మొక్క ఎదిగేటప్పుడు తప్పనిసరిగా 20:20:20 నిష్పత్తిలో ఎన్‌పీకే సమగ్ర ఎరువుని అందిస్తే పూలు నిండుగా పూస్తాయి.

**వ్యాధుల్ని అరికట్టాలంటే...**

తేమ ఎక్కువైతే ఈ మొక్కకు వేరు తెగులు వస్తుంది. అందుకే, చుట్టూ ఉన్న మట్టి పొడిగా అయ్యాకే నీళ్లు పోయాలి. తెల్లదోమ, ఆకుతొలుచు పురుగులు దీనికి పడతాయి. వాటి నివారణకు బేకింగ్ సోడా, సబ్బుద్రావణాన్ని ఉపయోగించండి. ఈ మొక్కకు ఔషధ గుణాలు ఎక్కువని... ప్రపంచ వ్యాప్తంగా ప్రాచీన వైద్య విధానాల్లో వాడుతుంటారు. పూలనూ తింటారు. సలాడ్లలో ఉపయోగిస్తారు. తేనె సమృద్ధిగా ఉండే ఈ పూలు హమ్మింగ్ బర్డ్‌లు, తేనెటీగలు, సీతాకోక చిలుకల్ని ఆకర్షిస్తాయి. తోట వైవిధ్యాన్ని మెరుగుపరుస్తాయి.



# పడకపోతే.. కలపకూడదట!

**మన నిత్య జీవితంలో పెరుగును చాలా వంటకాల్లో భాగం చేస్తుంటాం. అయితే కొన్ని పదార్థాలతో పెరుగును కలిపి తీసుకోవడం వల్ల కొంతమందికి పడకపోవచ్చని, అలాంటి సందర్భాలలో అలాంటి వాటికి దూరంగా ఉండడమే మంచిదంటున్నారు నిపుణులు.**

* చేపలు, పెరుగు.. ఈ రెండూ కలిపి తీసుకోకూడదన్న విషయం చాలామందికి తెలిసిందే! ఎందుకంటే ఈ రెండింటిలోనూ ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి. తద్వారా అజీర్తి సమస్య తలెత్తుతుంది. అంతేకాదు.. ప్రొటీన్లు ఎక్కువగా ఉండే ఇతర మాంసాహారంతోనూ దీన్ని కలపకపోవడమే మంచిదంటున్నారు నిపుణులు.
* మినప్పప్పుతో చేసిన పదార్థాలను పెరుగుతో కలిపి తీసుకుంటే కొంతమందిలో విరేచనాలు, కడుపుబ్బరం.. వంటి సమస్యలొస్తాయట!
* నూనె పదార్థాలు, పెరుగు కలిపి తీసుకోవడం వల్ల కొంతమందిలో జీర్ణ ప్రక్రియ నెమ్మదిస్తుందని చెబుతున్నారు నిపుణులు. అలాగే ఈ కాంబినేషన్ కొందరిలో బద్ధకం, మగత వంటి వాటికి కారణమవుతుందట.
* పెరుగుతో తయారుచేసే రైతాలో ఉల్లిపాయలు వేయడం చాలామందికి అలవాటే! అయితే ఈ కాంబినేషన్ కూడా కొందరికి పడకపోవచ్చంటున్నారు నిపుణులు. ఈ రెండూ కలవడం వల్ల కొంతమందిలో జీర్ణ సమస్యలు, చర్మ అలర్జీలు వంటివి వచ్చే అవకాశాలున్నాయట!
* కాబట్టి ఆయా పదార్థాలను పెరుగుతో కలిపి తీసుకున్నప్పుడు ఏదైనా అసౌకర్యం అనిపిస్తే.. అలాంటి వాటికి దూరంగా ఉండడమే మంచిదన్నది నిపుణుల సలహా.



# అబ్రకదబ్ర... అందాల బొమ్మ ప్రత్యక్షం!

ఇంట్లో అలంకరణ కోసం రకరకాల షోకేస్ బొమ్మల్ని తెచ్చుకుంటాం. కానీ కొన్నాళ్లకు వాటిని మార్చి కొత్తవి పెడుతుంటాం. అలా కాకుండా ఒకే డెకరేషన్ ఐటమ్- కోరుకున్న బొమ్మలా మారిపోతే భలే ఉంటుంది కదా. ఆ ముచ్చట తీరాలంటే త్రీడీ హోలోగ్రాఫిక్ ఫ్యాన్ పేరుతో వస్తున్న ఈ డెకరేషన్ ఐటమ్‌ని కొనండి. సన్నటి స్టాండుతో ఉండే ఈ పరికరం స్విచ్ ఆన్ చేయగానే అక్కడ అందమైన బొమ్మ ప్రత్యక్షం అవుతుంది. మాయ చేసినట్టుగా గాల్లో వెలుగులీనే ఆ చిత్రాన్ని చూసినవారెవరైనా ఒక్క క్షణం ఆశ్చర్యంతో కళ్లింతలు చేస్తారంటే నమ్మండి. అక్కడ ఏమీ లేకపోయినా కలర్‌ఫుల్ త్రీడీ దృశ్యాన్ని చూపించడమే ఈ పరికరం గొప్పతనం. ఎల్ఈడీ లైట్లతో ఉండే దీంట్లోని సన్నటి రెక్కలు చాలా వేగంగా గిరగిరా తిరగడం వల్లే త్రీడీ బొమ్మ మన ముందు కనిపిస్తుంది. లైట్లూ, ఫ్యాన్ వేగమే ఆ ఇల్యుజన్‌కి కారణం. ఫోన్ లేదా కంప్యూటర్ ద్వారా దీన్ని ఆపరేట్ చేస్తూ నచ్చిన బొమ్మనూ, వీడియోనూ అందులో చూపించొచ్చు. అలంకరణలతో అతిథుల్ని అవాక్కయ్యేలా చేయాలనుకునేవాళ్లు ఈ హోలోగ్రామ్ ఫ్యాన్‌ని కొనుక్కోవచ్చు. దీంట్లో బొమ్మను బట్టి రకరకాల సైజులవీ అందుబాటులో ఉన్నాయి. చాలా సంస్థలు వినియోగదారుల్ని ఆకట్టుకోవడానికి వీటిని డిస్‌ప్లే వేదికల్లా ఉపయోగిస్తున్నాయి. అంతేకాదు, కొంతమంది పెళ్లి వేడుకల్లో వధూవరుల వీడియోల్నీ ఈ సరికొత్త సాంకేతికత ద్వారా ప్రదర్శిస్తున్నారు.






## వెండి ఎట్ రూ.2.37 లక్షలు..

### ఏడాదిలో 153 శాతం పెరుగుదల



**న్యూఢిల్లీ:** బంగారు, వెండి ధరలు రాకెట్ వేగంతో దూసుకెళ్తున్నాయి. ముఖ్యంగా వెండి మరో చారిత్రక గరిష్ఠ స్థాయిని తాకింది. శుక్రవారం వెండి ధరలు దాదాపు 5శాతం పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ వెండి ధర 75 డాలర్ల మార్క్‌ను దాటింది. ఫలితంగా భారత్‌లోనూ వెండి ధరలు రికార్డు స్థాయికి చేరాయి. శుక్రవారం ఉదయం హైదరాబాద్ బులియన్ మార్కెట్లో కిలో వెండి ఏకంగా రూ.2,37,000 పలుకుతోంది. ఈ నెల 18వ తేదీ నుంచి ఇప్పటి వరకూ వెండి ధర దాదాపు 14 శాతం పెరిగింది. అటు బంగారం ధరలకు కూడా రెక్కలొచ్చాయి. ఇవాళ ఉదయం 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10గ్రాముల బంగారం ధర రూ.1.40 లక్షలుగా ఉంది. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,28,350గా నమోదైంది.

ఈ ఏడాదిలో ఇప్పటి వరకు వెండి ఏకంగా రూ.1,37,300 లేదా 153 శాతం ఎగబాకింది. గతేడాది డిసెంబర్ 31న రూ.89,700గా ఉన్న కిలో ధర ప్రస్తుతం రూ.2 లక్షలు దాటింది. డాలర్ బలహీనంగా ఉండటం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వచ్చే సమీక్షలో వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు సన్నగిల్లడం, ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుండటంతో మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాలవైపు మళ్లించడంతో వీటి ధరలు పెరుగుదలకు కారణమని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

## అగరుబత్తీలపై కేంద్రం కొత్త ప్రమాణాలు...

**వినియోగదారుల భద్రతే లక్ష్యం**

**అగరుబత్తీల తయారీలో కీలక మార్పులు**

**బీఐఎస్ కొత్త ప్రమాణాలు విడుదల**

**పలు హానికర రసాయనాలు, సువాసనల వాడకంపై నిషేధం**

**నాణ్యమైన ఉత్పత్తులకు బీఐఎస్ స్టాండర్డ్ మార్క్**

**భారత ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్‌లో పెరగనున్న ఆదరణ**



**న్యూఢిల్లీ:** దేశంలో అగరుబత్తీల (ధూప్ స్టిక్స్) నాణ్యత, భద్రతను పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వినియోగదారుల ఆరోగ్యం, పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) కొత్త ప్రమాణాలను విడుదల చేసింది. 'జాతీయ వినియోగదారుల దినోత్సవం 2025' సందర్భంగా శుక్రవారం కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి "ఐఎస్ 19412:2025 - అగరుబత్తీల స్పెసిఫికేషన్" పేరుతో ఈ నూతన ప్రమాణాలను ఆవిష్కరించారు.

ఈ కొత్త నిబంధనల ప్రకారం, అగరుబత్తీల తయారీలో పలు హానికరమైన పురుగుమందులు, సింథటిక్ సువాసనల వాడకాన్ని పూర్తిగా నిషేధించారు. అలత్రిన్, పెర్మెత్రిన్, సైపర్‌మెత్రిన్, డెల్టామెత్రిన్, ఫిప్రోనిల్ వంటి పురుగుమందులతో పాటు బెంజైల్ సైనైడ్, ఇథైల్ అక్రిలేట్ వంటి రసాయనాల వాడకంపై ఆంక్షలు విధించారు. వీటిలో చాలా రసాయనాలు మానవ ఆరోగ్యం, గాలి నాణ్యతపై తీవ్ర ప్రభావం చూపుతాయని అంతర్జాతీయంగా నిషేధంలో ఉన్నాయి.

ప్రపంచంలోనే అగరుబత్తీల ఉత్పత్తి, ఎగుమతుల్లో భారత్ అగ్రస్థానంలో ఉంది. దేశంలో ఏటా రూ. 8,000 కోట్ల పరిశ్రమ ఉండగా, సుమారు 150 దేశాలకు రూ. 1,200 కోట్ల విలువైన ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. ఈ రంగం గ్రామీణ ప్రాంతాల్లోని ఎందరో చేతివృత్తుల వారికి, మహిళలకు ఉపాధి కల్పిస్తోంది.

కొత్త ప్రమాణాల ప్రకారం అగరుబత్తీలను యంత్ర నిర్మిత, చేతితో తయారు చేసినవి, సాంప్రదాయ మసాలా రకాలుగా వర్గీకరించారు. ముడిసరుకులు, మండే విధానం, సువాసన వంటి అంశాల్లో నాణ్యతను నిర్దేశించారు. ఈ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ఉత్పత్తులకు 'బీఐఎస్ స్టాండర్డ్ మార్క్' లభిస్తుంది. దీనివల్ల వినియోగదారులు నాణ్యమైన, సురక్షితమైన ఉత్పత్తులను సులభంగా గుర్తించవచ్చని ప్రభుత్వం తెలిపింది. ఈ నిర్ణయం వినియోగదారుల నమ్మకాన్ని పెంచడంతో పాటు, భారత అగరుబత్తీలకు అంతర్జాతీయ మార్కెట్‌లో మరింత ఆదరణ లభిస్తుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

## ఐటీ, ఆటో షేర్ల ఒత్తిడి...

**కిందకు జారిన సూచీలు**

**367 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్, 100 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ**

**ఐటీ, ఆటో రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి**

**మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా నష్టాల్లోనే**

**మెటల్ షేర్లలో మాత్రం కొనుగోళ్ల ఉత్సాహం**



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. ఐటీ, ఆటో రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలపై ప్రతికూల ప్రభావం చూపింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 367.25 పాయింట్లు నష్టపోయి 85,041.45 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 99.80 పాయింట్లు క్షీణించి 26,042.30 వద్ద ముగిసింది. సెలవుల కారణంగా ఈ వారం ట్రేడింగ్ సెషన్లు తక్కువగా ఉండటం, మార్కెట్‌ను నడిపించే బలమైన సానుకూల సంకేతాలు లేకపోవడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. దీంతో పాటు సెన్సెక్స్ డెరివేటివ్‌ల గడువు ముగియడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను బలహీనపరిచింది.

బీఎస్ఈలో టైటన్, ఎన్టీపీసీ, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు లాభపడగా, బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ వంటి షేర్లు నష్టపోయాయి. ఎన్ఎస్ఈలో టైటన్, హిందాల్కో, నెస్లే ఇండియా లాభపడిన వాటిలో ఉన్నాయి. ఏషియన్ పెయింట్స్, శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్ నష్టాలను చవిచూశాయి.

విశాల మార్కెట్‌లోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.23 శాతం, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.08 శాతం మేర నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 1.03 శాతం, ఆటో ఇండెక్స్ 0.52 శాతం పతనమయ్యాయి. అయితే, దీనికి భిన్నంగా మెటల్ షేర్లు రాణించడంతో నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 0.59 శాతం లాభపడింది.

## బాల పురస్కారం అందుకున్న క్రికెటర్

# వైభవ్ సూర్యవంశీ



**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారాన్ని యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ అందుకున్నారు. రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా 14 ఏళ్ల ఆ క్రికెటర్ అవార్డును స్వీకరించారు. ఢిల్లీలో శుక్రవారం ఆ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ధైర్యసాహసాలు, కళలు, సంస్కృతి, పర్యావరణం, ఇన్నోవేషన్, సైన్స్ అండ్ టెక్నాలజీ, క్రీడల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన వారికి బాల పురస్కారాన్ని ప్రతి ఏడాది అందజేస్తారు. రాష్ట్రపతి భవన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అవార్డు స్వీకరించే క్రమంలో క్రికెటర్ వైభవ్ ఇవాళ మ్యాచ్‌కు దూరం అయ్యాడు. వాస్తవానికి బీహార్, మణిపూర్ మధ్య ఇవాళ విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్ జరుగుతున్నది. కానీ ఆ మ్యాచ్‌లో వైభవ్ ఆడడం లేదు. 5 నుంచి 18 ఏళ్లు ఉన్నవారికి బాల్ పురస్కారాలు అందజేస్తారు. వైభవ్‌తో పాటు మొత్తం 19 మంది పిల్లలకు వివిధ రంగాల్లో అవార్డులను అందజేయనున్నారు. మీరు సాధించిన ఘనత యావత్ దేశానికి ప్రేరణగా నిలుస్తుందని, ఇవాళ గుర్తింపు పొందిన ప్రతి చిన్నారి చాలా ముఖ్యమైన , విలువైన వ్యక్తులు అని, అలాంటి నైపుణ్యం ఉన్న పిల్లల వల్లే ప్రపంచవ్యాప్తంగా దేశానికి గుర్తింపు వస్తున్నదని రాష్ట్రపతి ముర్ము అన్నారు.

విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా రెండు రోజుల క్రితం అరుణాచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ 190 రన్స్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ సీజన్‌లో అతను మళ్లీ విజయ్ హజారే మ్యాచ్‌లను ఆడేది అనుమానంగాఉన్నది. ఆ యువ క్రికెటర్ అండర్19 జట్టుతో జతకలవనున్నాడు. జనవరి 15వ తేదీ నుంచి అండర్19 వరల్డ్‌కప్ జరగనున్నది. ఆ ప్రిపరేషన్ కోసం అతను విజయ్ హజారే ట్రోఫీ మిస్సయ్యే అవకాశాలు ఉన్నాయి.

## ఫీల్డింగ్ చేస్తూ గాయపడిన ఐపీఎల్ స్టార్..





**స్ట్రెచర్ మీద ఆస్పత్రికి తరలింపు..!**

**న్యూఢిల్లీ:** ఐపీఎల్‌లో మెరుపు ఇన్నింగ్స్‌లతో అలరించే అంగ్‌క్రిష్ రఘువంశీ అనుకోకుండా ఆస్పత్రి పాలయ్యాడు. దేశవాళీ టోర్నీలో ఆడుతూ గాయపడడంతో అతడిని దవాఖానకు తీసుకెళ్లారు. విజయ్ హజారే ట్రోఫీలో ముంబై తరపున బరిలోకి దిగిన అంగ్‌క్రిష్ శుక్రవారం ఉత్తరాఖండ్‌తో మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తుండగా గాయపడ్డాడు. నడలేని స్థితిలో ఉన్న అతడిని స్ట్రెచర్ మీద బయటకు తీసుకొచ్చి.. సమీపంలోని ఎస్‌డీఎంహెచ్ ఆస్పత్రిలో చేర్పించారు.

వన్డే ఫార్మాట్‌లో జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో ముంబైకి అంగ్‌క్రిష్ రఘువంశీ ఆడుతున్నాడు. జైపూర్‌లో శుక్రవారం ఉత్తరాఖండ్‌పై 11 పరుగులతో నిరాశపరిచిన అతడు.. ఫీల్డింగ్‌లో కష్టమైన క్యాచ్ అందుకునే క్రమంలో గాయపడ్డాడు. ఎలాగైనా బంతిని ఒడిసిపట్టేందుకు ప్రయత్నించిన ఈ యువకెరటం తల, భుజాలకు గాయాలయ్యాయి. దాంతో.. నొప్పితో మైదానంలోనే కూలబడిన అతడిని ఫిజియో వచ్చి పరీక్షించాడు.

అయినా పరిస్థితి మెరుగవ్వకపోవడంతో సిబ్బంది స్ట్రెచర్ మీద అంగ్‌క్రిష్‌ను బయటకు తీసుకెళ్లారు. అనంతరం.. ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని సమాచారం. ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ బ్యాటింగ్ అస్త్రంగా పేరొందిన అంగ్‌క్రిష్ టాపార్డర్ బ్యాటర్. ఇప్పటివరకూ రెండు సీజన్లలో 22 మ్యాచులు ఆడిన ఈ చిచ్చరపిడుగు 463 పరుగులు సాధించాడు.

## కోహ్లీ ఖాతాలో మరో మైలురాయి..

**ఆస్ట్రేలియా దిగ్గజం**

**'ఆల్‌టైమ్ రికార్డు' గల్లంతు..!**

**న్యూఢిల్లీ:** వన్డే ఫార్మాట్లో రారాజుగా వెలుగొందుతున్న విరాట్ కోహ్లీ వరుసగా రికార్డులను బ్రేక్ చేస్తున్నాడు. సిడ్నీ వన్డేలో అర్ధ శతకంతో మొదలైన విరాట్ పరుగుల ప్రవాహం అవిఘ్నంగా కొనసాగుతోంది. బీసీసీఐ కోరిక మేరకు విజయ్ హజారే ట్రోఫీలోనూ ఆడుతున్న తడాఖా చూపిస్తున్నాడు. వచ్చే ప్రపంచకప్ లక్ష్యంగా పదిహేనేళ్ల తర్వాత ఈ లీగ్‌లో ఆడుతున్న అతడు.. విధ్వంసక ఆటతో అందర్నీ ఫిదా చేస్తున్నాడు. శుక్రవారం గుజరాత్‌పై హాఫ్ సెంచరీతో కదం తొక్కిన విరాట్ మళ్లీ వంద కొట్టేలా కనిపించాడు. కానీ, 77 పరుగుల వద్ద వెనుదిరిగాడు. అయినా సరే.. అత్యధిక సగటుతో ఆస్ట్రేలియా మాజీ ఫినిషర్ మైఖేల్ బెవాన్ పేరిట ఉన్న ఆల్‌టైమ్ రికార్డును దాటేశాడు.





కింగ్ కోహ్లీ.. అక్కడా రికార్డుల దుమ్ముదులుపుతున్నాడు. తొలి మ్యాచ్‌లోనే శతకంతో రెచ్చిపోయిన భారత స్టార్.. గుజరాత్‌పై అర్ధ శతకంతో మరో రికార్డు పట్టేశాడు. లిస్ట్ - ఏ క్రికెట్‌లో అత్యధిక సగటు నమోదు చేశాడు.

ఇటీవల కాలంలో సూపర్ ఫామ్ కొనసాగిస్తున్న కోహ్లీ విజయ్ హజారే ట్రోఫీతో 'నాటౌట్ కింగ్'గా పేరొందిన బెవాన్ సగటు లిస్ట్ ఏ క్రికెట్‌లో 57.86 కాగా.. కోహ్లీ 57.87తో అతడిని అధిగమించాడు. లిస్ట్ ఏలో సచిన్ టెండూల్కర్ రికార్డును బద్దలు కొడుతూ అత్యల్ప మ్యాచుల్లోనే 16 వేల క్లబ్‌లో చేరాడు విరాట్. ప్రస్తుతం 343 మ్యాచుల్లో 57.60 సగటుతో 16,130 రన్స్ బాదాడు. ఇందులో 58 సెంచరీలు, 84 అర్ధ శతకాలు ఉన్నాయి.

## అమ్మో.. భారత గ్రాండ్‌మాస్టర్‌తో

# అంత ఈజీ కాదు..!

**న్యూఢిల్లీ:** ఇటీవల కాలంలో భారత కుర్రాళ్లు చదరంగంలో అబ్బురపరిచే విజయాలతో ఔరా అనిపిస్తున్నారు. వేదిక ఏదైనా తమదైన ప్రతిభతో మేటి ఆటగాళ్లను సైతం ఓడిస్తున్నారు. వరల్డ్ నంబర్ 1 మాగ్నస్ కార్ల్‌సన్ సైతం అమ్మో భారత కుర్రాళ్లతో తలపడడం కష్టమేనని అంటున్నాడు. ఫిడే వరల్డ్ ర్యాపిడ్, బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్‌ను పురస్కరించుకొని మాట్లాడిన ఈ నార్వే లెజెండ్ మాజీ ఛాంపియన్ డి.గుకేశ్‌తో ఆడడం ఎల్లప్పుడూ సవాల్‌గానే ఉంటుందని అన్నాడు.

దోహాలోని ఖతార్‌లో జరుగుతున్న ఫిడే వరల్డ్ ర్యాపిడ్, బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్‌లో కార్ల్‌సన్ ఫేవరెట్‌గా ఆడుతున్నాడు. ఈ టోర్నీలో జూనియర్ల నుంచి తనకు గట్టి పోటీ ఎదురుకానుందని చెబుతున్న అతడు భారత కుర్రాడు గుకేశ్‌తో ముప్పేనని అంటున్నాడు. గత కొన్ని రోజులుగా నేను యంగ్‌స్టర్స్‌తో మ్యాచ్‌లు ఆడలేదు. వారు ఈ మధ్య చాలా గొప్పగా ఆడుతున్నారు. ముఖ్యంగా డి.గుకేశ్ అదరగొడుతున్నాడు.




16 నుంచి 22 ఏళ్లున్న యువకెరటాలతో ప్రమాదం పొంచి ఉంటుంది అని కార్ల్‌సన్ తెలిపాడు.

ఈ ఏడాది నార్వే చెస్‌లో గుకేశ్ వ్యూహాలకు బదులివ్వలేక కార్ల్‌సన్ చేతులెత్తేశాడు. వరల్డ్ నంబర్1ను ఓడించి వార్తల్లో నిలిచాడు భారత గ్రాండ్‌మాస్టర్. అయినా సరే గుకేశ్‌ను తాను గ్రేట్ ప్లేయర్‌గా కాకుండా యంగ్‌స్టర్‌గానే చూస్తానని అంటున్నాడీ చెస్ కింగ్. ఈ మధ్య స్వదేశంలో ముగిసిన చెస్ వరల్డ్‌కప్‌లో నిరాశపరిచిన గుకేశ్ .. ఫిడే వరల్డ్ ర్యాపిడ్, బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్‌లో కార్ల్‌సన్‌కు చెక్ పెట్టాలనే పట్టుదలతో ఉన్నాడు. అతడితో పాటు అర్జున్ ఎరిగేసి, ప్రజ్ఞానంద.. కోనేరు హంపి, ద్రోణవల్లి హారికలు సత్తా చాటాలనుకుంటున్నారు. ఈ టోర్నీ డిసెంబర్ 26 నుంచి డిసెంబర్ 30 వరకు జరగనుంది.

# కలెక్షన్లలోనూ ఛాంపియన్



**టాకీస్:** యంగ్ హీరో రోషన్ నటించిన తాజా చిత్రం 'ఛాంపియన్' థియేటర్లలో సూపర్ జోష్‌తో దూసుకెళ్తోంది. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా 25న ప్రేక్షకుల ముందుకు రాగా, ఫస్ట్ షో నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. దీంతో బాక్సాఫీస్ వద్ద 'ఛాంపియన్' కలెక్షన్స్ భారీగా నమోదు అవుతున్నాయి. ముఖ్యంగా రోషన్ కెరీర్‌లోనే ఈ సినిమాకు బెస్ట్ ఓపెనింగ్స్ రావడం విశేషంగా మారింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, కేవలం నైజాం ఏరియాలోనే రూ. 2 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది. ఇక వరల్డ్ వైడ్ ఫస్ట్ డే కలెక్షన్స్ దాదాపు రూ. 4.5 కోట్ల గ్రాస్ వరకు చేరి అందరిని ఆశ్చర్యపరిచింది. రోషన్ గత చిత్రాలతో పోలిస్తే ఇదే అతడి కెరీర్‌లో అత్యధిక ఓపెనింగ్ రికార్డ్‌గా నిలిచింది. ఈ సినిమాకు స్వప్న సినిమాస్ వంటి పెద్ద బ్యానర్ సపోర్ట్, దర్శకుడు ప్రదీప్ అద్వైతం అందించిన పవర్‌ఫుల్ టేకింగ్ ప్రధాన బలాలుగా నిలిచాయి. అలాగే మలయాళ బ్యూటీ అనస్వరా రాజన్ నటనకు ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు లభిస్తున్నాయి. కథ, యాక్షన్ సీక్వెన్సులు, ఎమోషనల్ ఎలిమెంట్స్ సమతుల్యంగా ఉండటంతో సినిమా చూసినవాళ్లు బాగుందని చెప్పడం వల్ల వర్డ్ ఆఫ్ మౌత్ బలంగా స్ప్రెడ్ అవుతోంది. సోషల్ మీడియాలో కూడా 'ఛాంపియన్'కు పాజిటివ్ బజ్ కొనసాగుతోంది. రివ్యూలు అనుకూలంగా రావడంతో టికెట్ బుకింగ్స్ వేగంగా పెరుగుతున్నాయి. ఈ ప్రభావంతో వీకెండ్ కలెక్షన్స్ మరింత పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సంగీత దర్శకుడు మిక్కీ జె మేయర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకి మరింత ఎనర్జీని అందించగా, మురళీ శర్మ, సంతోష్ ప్రతాప్ వంటి నటుల పర్ఫార్మెన్స్‌లు కథకు అదనపు బలం చేకూర్చాయి. మొత్తం మీద 'ఛాంపియన్' సినిమా రోషన్ కెరీర్‌లో ఒక కీలక మైలురాయిగా నిలుస్తూ, బాక్సాఫీస్ వద్ద జెట్ స్పీడ్‌లా దూసుకెళుతుంది.

# ధురంధర్ కలెక్షన్ల దూకుడు

## వెయ్యికోట్ల క్లబ్‌లో చేరిన మూవీ



**టాకీస్:** బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్' బాక్సాఫీస్ వద్ద చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. తాజాగా ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరి భారతీయ సినిమా రికార్డులను తిరగరాసింది. విడుదలైన కేవలం 21 రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 1006.7 కోట్ల వసూళ్లను సాధించినట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ఇప్పటివరకు ఇండియాలో రూ. 789.18 కోట్ల గ్రాస్ (రూ. 633.5 కోట్ల నెట్) వసూళ్లు రాబట్టిన ఈ చిత్రం ఓవర్సీస్ మార్కెట్‌లో రూ. 217.5 కోట్ల మార్కును దాటి దూసుకుపోతోంది. దీంతో అత్యధిక వసూళ్లు సాధించిన మొదటి 10 భారతీయ చిత్రాల జాబితాలో 'ధురంధర్' 9వ స్థానంలో నిలిచింది. అలాగే రణబీర్ కపూర్ 'యానిమల్' రికార్డులను ఈ చిత్రం అధిగమించింది.'ఉరి' వంటి సెన్సేషనల్ హిట్ ఇచ్చిన ఆదిత్య ధర్ ఈ సినిమాకు దర్శకత్వం వహించగా.. రణ్‌వీర్ సింగ్‌తో పాటు సంజయ్ దత్, అక్షయ్ ఖన్నా, మాధవన్ వంటి దిగ్గజ నటులు ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటించారు. 1999 కాందహార్ విమానం హైజాక్, 2001 పార్లమెంట్ దాడి వంటి యదార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కింది. మరోవైపు ఈ సినిమా సీక్వెల్ వచ్చే ఏడాది మార్చి 19న ఈద్ కానుకగా విడుదల కాబోతుంది. మొదటి భాగం కేవలం హిందీలోనే సంచలనం సృష్టించగా, రెండో భాగాన్ని తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో భారీగా విడుదల చేయనున్నారు.

# నెట్‌ఫ్లిక్స్‌లో వస్తోన్న మళయాళ మూవీ ఎకో




**టాకీస్:** మలయాళ చిత్ర పరిశ్రమ నుంచి వచ్చే థ్రిల్లర్ సినిమాలకు తెలుగు ప్రేక్షకుల్లో విపరీతమైన క్రేజ్ ఉంటుందన్న విషయం తెలిసిందే. ఇప్పటికే పలు సినిమాలు ఓటీటీ వేదికగా వచ్చి అలరించాయి. అయితే గతేడాది 'కిష్కింధ కాండం' సినిమాతో అందరినీ ఆశ్చర్యపరిచిన దర్శకుడు దిన్జిత్ అయ్యతన్ నుంచి వచ్చిన మరో అద్భుత దృశ్యకావ్యం ఎకో. అలపుజా జింఖానా సినిమాతో సూపర్ హిట్ అందుకున్న యువ నటుడు సందీప్ ప్రదీప్ చిత్రంలో ప్రధాన పాత్రలో నటించగా.. వినీత్, నరైన్ కీలక పాత్రల్లో మెరిశారు. నవంబర్ 21న థియేటర్లలో విడుదలై విమర్శకుల ప్రశంసలు అందుకున్న ఈ చిత్రం, ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో సందడి చేసేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఈ చిత్ర డిజిటల్ హక్కులను సొంతం చేసుకుంది. న్యూ ఇయర్ కానుకగా డిసెంబర్ 31 నుంచి ఈ సినిమా మలయాళంతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. కేరళ మరియు కర్ణాటక సరిహద్దులోని కాట్టుకున్ను అనే అటవీ ప్రాంతం నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. అడవిలోని రహస్యాలు, మనుషులు మరియు వన్యప్రాణుల మధ్య ఉండే సున్నితమైన, అంతుచిక్కని బంధం చుట్టూ దర్శకుడు ఈ మిస్టరీని తెరకెక్కించాడు.



**టాకీస్:** టాలీవుడ్‌లో ముక్కుసూటి వ్యాఖ్యలతో గుర్తింపు తెచ్చుకున్న నటుడు శివాజీ మరోసారి వివాదానికి కేంద్రబిందువయ్యారు. రాజకీయాలు అయినా, సినిమా రంగానికి సంబంధించిన అంశాలైనా తన అభిప్రాయాన్ని ఏ మాత్రం మొహమాటం లేకుండా చెప్పడం శివాజీ ప్రత్యేకత. అయితే ఇటీవల 'దండోరా' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈవెంట్‌కు హాజరైన ప్రేక్షకులు, అభిమానులు సినిమా విశేషాలు వినాలని ఎదురుచూస్తున్న వేళ శివాజీ మాత్రం అనూహ్యంగా హీరోయిన్ల డ్రెస్సింగ్ స్టైల్‌పై మాట్లాడడం ప్రారంభించారు. చీరలోనే అసలైన అందం దాగి ఉంటుందని, హీరోయిన్లు ఏది పడితే అది ధరించకూడదని వ్యాఖ్యానించారు. అయితే ఈ వ్యాఖ్యల కంటే, ఆయన ఉపయోగించిన పదజాలమే వివాదానికి అసలు కారణమైంది. ఈ వ్యాఖ్యలపై టాలీవుడ్‌లో తీవ్ర స్పందన వ్యక్తమైంది. యాంకర్ అనసూయ భరద్వాజ్, గాయని చిన్మయి సహా పలువురు ప్రముఖులు శివాజీ మాటలను ఖండించారు. "మా బాడీ మా ఇష్టం" అంటూ వారు వ్యాఖ్యానించారు. "తప్పు దుస్తుల్లో కాదు తప్పు చూపులో ఉంది" అంటూ మహిళా సంఘాలు, సోషల్ మీడియా యూజర్లు కూడా ఘాటుగా స్పందించారు. మహిళల వ్యక్తిగత స్వేచ్ఛపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని పలువురు అభిప్రాయపడ్డారు. వివాదం తీవ్రరూపం దాల్చడంతో శివాజీ కూడా స్పందించక తప్పలేదు. ఆవేశంలో కొన్ని పదాలు నోరు జారినట్లు అంగీకరించిన ఆయన, తన మాటల వల్ల బాధపడిన మహిళలందరికీ బహిరంగంగా క్షమాపణలు తెలిపారు. తాను ఎవరినీ కించపరిచే ఉద్దేశంతో మాట్లాడలేదని, కానీ తన మాటలు అలా అనిపించి ఉంటే బాధ్యతగా క్షమాపణ చెబుతున్నానని స్పష్టం చేశారు. ఈ మొత్తం వివాదం నేపథ్యంలో తాజాగా హీరోయిన్ హెబ్బా పటేల్ స్పందించడం ఆసక్తికరంగా మారింది. ఓ కార్యక్రమంలో ఈ అంశంపై ఆమెను ప్రశ్నించగా, ఇతరుల వ్యాఖ్యలపై స్పందించడం లేదా వారి వ్యక్తిగత అభిప్రాయాల్లో జోక్యం చేసుకోవడం తనకు ఇష్టం లేదని ఆమె తెలిపింది. ఇలాంటి వివాదాలకు దూరంగా ఉండటమే మంచిదని అభిప్రాయపడింది. ఒక మహిళకు తనకు నచ్చిన దుస్తులు ధరించే పూర్తి స్వేచ్ఛ ఉంటుందని, దానిపై ఎవరూ తీర్పులు చెప్పాల్సిన అవసరం లేదని హెబ్బా స్పష్టం చేసింది. హెబ్బా పటేల్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. 'కుమారి 21ఎఫ్' సినిమాతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన హెబ్బా, తొలి సినిమాతోనే యూత్‌లో మంచి క్రేజ్ సంపాదించింది. ఆ తర్వాత వరుస అవకాశాలతో గ్లామర్ రోల్స్‌లో కనిపిస్తూ తనకంటూ ప్రత్యేకమైన ఫాలోయింగ్‌ను ఏర్పరుచుకుంది. స్పెషల్ సాంగ్స్‌కూ ఓకే చెబుతూ ఇండస్ట్రీలో తన స్థానం నిలబెట్టుకుంటోంది.

**ఇలాంటి వివాదాలకు దూరంగా ఉండటమే మంచిది: హెబ్బా పటేల్**

# దండోరాను ఆదరించండి

## ప్రేక్షకులకు నటుడు శివాజీ వినతి




**టాకీస్:** 'దండోరా'ను ఆదరించిన ప్రేక్షకులకు చిత్రబృందం ధన్యవాదాలు తెలిపింది. థియేటర్‌లో ఆడియన్స్ స్పందన చూస్తుంటే గూస్‌బంప్స్ వచ్చాయని దర్శకుడు మురళీకాంత్ అన్నారు. పల్లె కథగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'దండోరా' పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. తాజాగా చిత్రబృందం సక్సెస్‌మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా నటుడు శివాజీ మాట్లాడుతూ.. 'కొన్ని తరాలకు ఒకసారి ఇలాంటి సినిమా వస్తుంది. రెండురోజుల ముందు ప్రీమియర్స్ పడిన్లైతే కలెక్షన్లు వేరేలా ఉండేవి. సెన్సార్ వల్ల విడుదల ఆలస్యమైంది. 'దండోరా' గురించి 2026 మొత్తం కూడా మాట్లాడుకుంటారు. విదేశాల్లో కూడా మంచి ఆదరణ లభిస్తోంది. ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నన్ని రోజులు నేను నిద్రపోయింది కేవలం రెండు గంటలే. ఎందుకంటే ముఖం ఉబ్బుగా ఉండాలని నిద్ర మానుకున్నాను. సినిమా మొత్తం నిద్రముఖంలానే ఉంటుంది. నా పాత్రకు నేను అలా కనిపించకపోతే డైరెక్టర్ దెబ్బతింటాడు. నిద్రమానుకోమని డైరెక్టర్ నాకు చెప్పలేదు.. కానీ, నేనే అలా చేశా. సినిమా కోసం ప్రతి ఆర్టిస్టూ ప్రాణం పెడతారు. అలా చేసిన సినిమానే 'దండోరా'. దయచేసి నా వ్యక్తిగత విషయాల వైపు వెళ్లకండి. నేను వాటి గురించి విడిగా చూసుకుంటాను. వాటివైపు వెళ్లకుండా ఈ సినిమాను ప్రమోట్ చేయండి. లేదంటే ఆ నింద నేను మోయాల్సి వస్తుంది. ఈ సినిమా గురించి మాత్రమే మాట్లాడండి. కావాలంటే నేను థియేటర్‌కు వస్తాను. ఏం మాట్లాడాలన్నా నేను థియేటర్‌లో మాట్లాడతాను. మంచి సినిమాను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రతి ఆర్టిస్టుకు ఉంటుంది' అని అన్నారు. నేను మూడేళ్లుగా 'దండోరా' కోసం కష్టపడ్డాను. ఆ శ్రమకు తగిన ఫలితం స్క్రీన్‌పై కనిపించింది. డిసెంబర్ 25న చాలా సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. కథపై మాకున్న నమ్మకంతోనే పోటీకి భయపడకుండా విడుదల చేశాం. ఇది మూడున్నరేళ్ల కష్టం. ఈవెంట్‌లలో రెండుమూడు మాటలు దొర్లితే వాటి ఆధారంగా సినిమాను జడ్జ్ చేయకండి' అని దర్శకుడు మురళీకాంత్ కోరారు. థియేటర్‌కు వచ్చి సినిమా చూసి అభిప్రాయాన్ని తెలపాలన్నారు.

# నిరాశపర్చిన మోహన్ లాల్ వృషభ




**టాకీస్:** భాషల హద్దులు దాటి ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న అరుదైన నటుల్లో మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ ఒకరు. సహజమైన నటన, సింపుల్ బాడీ లాంగ్వేజ్, పాత్రలో పూర్తిగా లీనమయ్యే తీరు ఆయనకు ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చిపెట్టాయి. మలయాళంతో పాటు తెలుగు, తమిళం, హిందీ భాషల్లోనూ మోహన్‌లాల్‌కు విశేషమైన అభిమాన వర్గం ఉంది. ఆయన సినిమా అంటే తప్పకుండా కంటెంట్ ఉంటుందనే నమ్మకం ప్రేక్షకుల్లో బలంగా ఉండటంతో, ఆయన నుంచి వచ్చే ప్రతి చిత్రం పాన్ ఇండియా స్థాయిలో ఆసక్తిని రేకెత్తిస్తుంది. ఈ నేపథ్యంలో క్రిస్మస్ కానుకగా విడుదలైన మోహన్‌లాల్ తాజా చిత్రం 'వృషభ' పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా విడుదలకు ముందు విడుదలైన టీజర్, ట్రైలర్‌లకు మంచి స్పందన లభించడంతో పాటు, మోహన్‌లాల్‌ను పవర్‌ఫుల్ పాత్రలో చూపిస్తున్నారన్న ప్రచారం సినిమాపై హైప్‌ను పెంచింది. నందకిషోర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రాగిణి ద్వివేది కీలక పాత్రలో నటించగా, సమర్జిత్ లంకేష్, నయన్ సారిక మరో జంటగా కనిపించారు. అజయ్, వినయ్ వర్మ, భద్రం తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు. డిసెంబర్ 25న మలయాళం, తెలుగులో ఒకేసారి ఈ సినిమాను విడుదల చేశారు.అయితే థియేటర్లలో అడుగుపెట్టిన తర్వాత 'వృషభ' పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారింది. ప్రేక్షకుల నుంచి ఆశించిన స్థాయి స్పందన రాకపోవడంతో పాటు, తొలి రోజు వసూళ్లు ట్రేడ్ వర్గాలను షాక్‌కు గురి చేశాయి. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, 'వృషభ' మొదటి రోజు నెట్ కలెక్షన్లు కేవలం రూ.70 లక్షలకే పరిమితమయ్యాయి. ఇది మోహన్‌లాల్ కెరీర్‌లోనే అత్యల్ప ఓపెనింగ్స్‌లో ఒకటిగా నిలవడం గమనార్హం. మొదటి రోజు నుంచే సినిమాపై నెగటివ్ టాక్ రావడం వసూళ్లపై తీవ్ర ప్రభావం చూపింది. కథ, కథనంలో బలహీనతలు ఉన్నాయన్న అభిప్రాయం ప్రేక్షకుల నుంచి వ్యక్తమవుతుండటంతో, వీకెండ్‌లో సినిమా పుంజుకుంటుందా అనే సందేహాలు ట్రేడ్ వర్గాల్లో వినిపిస్తున్నాయి. స్టార్ పవర్ మాత్రమే సరిపోదని, కంటెంట్ బలంగా లేకపోతే ప్రేక్షకులు ఆదరించరన్న వాస్తవాన్ని 'వృషభ' మరోసారి రుజువు చేసిందని చెప్పవచ్చు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.